సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 28-7-2023 15/-

## మరో మస్జిదుపై కన్నేసిన మతతత్వం



## టీం ఇండియా






సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237

Email : geeturaiweekly@gmail.com

Website: www.tiptrust.in

సంపుటి 45 సంచిక: 30 హైదరాబాద్
శుక్రవారం 28 జులై 2023 రూ.15-00
9 ముహర్రం 1445 హిజ్రీ


**తొలిగీటు**

**ఎవరు తన సోదరునికి అవసరమున్నప్పుడు తోడ్పడతారో వారి అవసరానికి అల్లాహ్ తానే వారిని ఆదుకుంటాడు.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


కథ



30

**ప్రయాణం**

## లోపల...


| | | |
|---|---|---|
| మణిపూర్ "లజ్జ" | ...... | 04 |
| మరో మస్జిదుపై కన్నేసిన మతతత్వం | ...... | 05 |
| చరితార్థులు-2 : రాయ్ అహ్మద్ నవాజ్‌ఖాన్ ఖారల్ | ...... | 09 |
| టీం ఇండియా | ...... | 10 |
| ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తామన్న కేసీఆర్ | ...... | 14 |
| ఫేక్‌న్యూస్ రౌండప్ | ..... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| గర్వభంగం - 2 | ..... | 20 |
| ఇమామ్ త్యాగం ప్రేరణ కావాలి | ...... | 22 |
| మరణ మర్మాన్ని తెలుసుకుని జీవించాలి | ...... | 24 |
| ప్రజాస్వామిక విలువలను జ్ఞప్తికి తెచ్చే ముహర్రం నెల | ...... | 26 |
| నమాజ్ పట్ల నిర్లక్ష్యం క్షంతవ్యం కాదు | ...... | 28 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |


### వన్ మ్యాన్ షో...?




ఓ వైపున ఇండియా
మరోవైపు బీ.జే.పీ
బీఆరెస్ నేతలకు
పెరుగుతోంది బీపీ!
భాజపా కాంగీలకు
దూరమంట సారు
ఇద్దరితో చేస్తాడట
కేసీయారు పోరు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

ఆలోచన

# మణిపూర్ "లజ్జ"

**దిగ్భ్రాంతికరమైన,** మానవత్వం సిగ్గుతో తలదించుకునే సంఘటనలు మణిపూర్‌లో జరుగుతున్నాయి. ఆదివాసీ కుకీ తెగ మహిళలు ఇద్దరిని నగ్నంగా పెరేడ్ చేయించి హింసిస్తున్న వీడియో ఇటీవల వెలుగులోకి వచ్చింది. బిఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షాలు ఎక్కడున్నారని? ఏం చేస్తున్నారని? ప్రశ్నించడంలో ఎంతైనా ఔచిత్యముంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. కేంద్రంలోను, రాష్ట్రంలోను ఉన్నది బీజేపీ ప్రభుత్వమే. ఈ అమానుష సిగ్గుచేటు సంఘటన తర్వాత గుర్తుపట్టని దుండగులపై పోలీసు కేసు నమోదు చేశామని మణిపూర్ పోలీసులు ప్రకటించారు. కుకీ ప్రజలపై హింసాదౌర్జన్యాలకు బాహాటంగా పాల్పడిన ఆ దుండగులు గుర్తుపట్టలేని వారేమీ కాదు, వీడియోల్లో వారి ముఖాలు స్పష్టంగా కనబడుతూనే ఉన్నాయి. దేశంలో వివిధ ప్రాంతాల్లో జరిగిన మూకదాడుల సంఘటనల్లోనూ ఇలాంటి దృశ్యాలే మనకు కనిపిస్తాయి. మనుషుల రూపంలో ఉన్న క్రూరమృగాల గుంపుల అమానుషాలు చాలా సార్లు ముందుకు వచ్చాయి. పోలీసులు చాలా సార్లు తమాషా చూశారు.

యూరోపియన్ పార్లమెంటు ఇటీవల ఆమోదించిన తీర్మానం భారత ప్రతిష్ఠను అంతర్జాతీయంగా మంటగలిపింది. మణిపూర్ హింసాకాండ మే 3వ తేదీ నుంచి కొనసాగుతోంది. ఇంత సుదీర్ఘ కాలం ఈ హింసాకాండ కొనసాగుతుందంటే అర్థమేమిటి? ప్రతి రోజు తుపాకీ కాల్పుల మోత, సాయుధ దుండగుల వీరంగాలకు అర్థమేమిటి? కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ హింసాకాండను అనుమతించకపోతే ఇది ఇంతకాలం అడ్డూ అదుపు లేకుండా కొనసాగడం సాధ్యమా?

మణిపూర్ కుకీ ఆదివాసీలను విలన్లుగా చిత్రీకరించే ప్రచారం చాలా కాలంగా నడుస్తూనే ఉంది. కుకీల్లో చాలా మంది మయన్మార్ నుంచి వచ్చిన చొరబాటుదారులనే ఈ ప్రచారంతో కుకీలను విలన్లుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి ప్రయత్నమే అస్సాంలో ముస్లిములను బంగ్లాదేశీలుగా చిత్రించి వారిపై దౌర్జన్యాలకు ఉపయోగపడింది. అస్సాంలో ముస్లిములు, మణిపూర్‌లో క్రయిస్తవులు ఈ దారుణాలకు బలవుతున్నారు.

మణిపూర్‌లో జరుగుతున్నది అమానుషం అని చెప్పడానికి ఎవరైనా ఆలోచించవలసిన అవసరమే ఉండదు. అంతా కంటి ముందు కనిపిస్తోంది. కాని ప్రధాని నరేంద్రమోడీ మౌనమే నా భాష అంటున్నారు. మణిపూర్‌లో ఇప్పుడు పరిపాలన అనేది పూర్తిగా స్తంభించింది. కాని కేంద్రంలోని పెద్దలు అసలు పట్టనట్లే వ్యవహరిస్తున్నారు. ఇంఫాల్ మైదాన ప్రాంతంలో చట్టం తమ చుట్టంగా భావించే దుండగులు రెచ్చిపోతున్నారు. తమ తెగ ప్రజలను కాపాడే వీరసైనికులమని చెప్పుకుంటున్నారు. మయన్మార్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారుల నుంచి, గంజాయి సాగు చేసే దుర్మార్గుల నుంచి, మాదకద్రవ్యాలు సరఫరా చేసే దుష్టుల నుంచి మణిపూర్‌ను కాపాడేస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నారు. బాధిత ప్రజలను విలన్లుగా చిత్రీకరిస్తే వారిపై దాడులకు, దౌర్జన్యాలకు లైసెన్సు లభించినట్లవుతుందన్నది ఎప్పటి నుంచో అమలు చేస్తూ వస్తున్న వ్యూహం. మరోవిధంగా చూస్తే ఈ వ్యూహం దేశవ్యాప్తంగా కూడా అమలవుతోంది. గోవధకు పాల్పడుతున్న వారి నుంచి ఆవులను కాపాడుతున్నామనే ప్రచారం మూకదాడులకు, మూకహత్యలకు కావలసిన సాకును అందిస్తోంది. చాలా మందికి గుర్తుండే ఉంటుంది, జయంత్ సిన్హా మంత్రిగా ఉండి మూకహత్యల నేరస్తులకు పూల మాలలు వేసి సత్కరించడం వెనుక కారణమిదే. ఆ మూకహత్యలకు పాల్పడిన వారిని హీరోలుగాను, వారు హతమార్చిన అభాగ్యులను విలన్లుగాను చిత్రీకరించిన మతతత్వ ప్రచారమే ఇలాంటి దుర్మార్గపు సంఘటనల వెనుక ఉంది. మణిపూర్‌లో కూడా ఈ అబద్ధాల ప్రచారమే ఒక సముదాయాన్ని విలన్లుగా చిత్రీకరిస్తోంది. వారి భూములను లాక్కోడానికి స్వార్థశక్తులకు అవకాశాన్ని కల్పిస్తోంది.

ఇలాంటి దుర్మార్గపు అబద్ధాల ప్రచారంతో మానవత్వాన్ని వదిలేసిన గుంపులు దేనికైనా తెగబడతాయి. మణిపూర్‌లో జరిగింది అదే. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ, వారిని లైంగికంగా వేధిస్తూ, వారిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఈ అత్యంత అమానుష సంఘటన తర్వాతైనా మణిపూర్ పట్ల మౌనాన్ని వదులుతారా? రెండున్నర నెలలుగా మణిపూర్ హింసాకాండ కొనసాగుతోంది. ఇంతకాలం హింసాకాండ కొనసాగడం అంటే ఒక పథకం ప్రకారం అవసరమైన ఏర్పాట్లతో ఇదంతా జరుగుతుందని అర్థం కావడం లేదా? ఒక పథకం ప్రకారమే ఇదంతా జరుగుతోంది కాబట్టే మోడీ ప్రభుత్వం మౌనంగా చూస్తోందని చాలా మంది అభిప్రాయపడడంలో తప్పేముంది.

అబ్దుల్ వాహెద్



# మరో మస్జిదుపై కన్నేసిన మతతత్వం

**ఈ జాబితా చాలా పెద్దదే. ఇప్పుడు మరో సరికొత్త వివాదం మన ముందుకు వచ్చింది. ఇలాంటివి మరికొన్ని భవిష్యత్తులో రావచ్చు. నిరంతరం రెండు వర్గాల మధ్య ఘర్షణాత్మక వాతావరణాన్ని కొనసాగించడానికి కావలసిన సరంజామా మతతత్వ శక్తుల చేతుల్లో ఉంది.**

విచిత్రమేమిటంటే, జూన్ నెలలో ప్రధాని మోడీ అమెరికా పర్యటన నుంచి వెనక్కు వస్తున్నప్పుడు ఈజిప్టులో ఆగారు. కైరోలోని 1000 సంవత్సరాల పురాతన అల్ హకీం బిన్ అమ్రల్లా మస్జిదును సందర్శించారు.

జులై నెలలో ఇక్కడ ఇండియాలో 800 సంవత్సరాల చరిత్ర ఉన్న పురాతన జుమా మస్జిదులో ముస్లిముల నమాజులపై అక్కడి కలెక్టరు నిషేధాజ్ఞలు విధించారు.

విదేశీ ముస్లిములతో స్నేహం స్వదేశీ ముస్లిములతో వైరం ఇదేనా నవభారతం.

ఈ కొత్త వివాదం ఏమిటంటే --

మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వమే ఉంది. మహా రాష్ట్రలోని జల్గాంవ్ జిల్లాలో 800 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన మస్జిదు ఉంది. ఈ జుమ్మా మస్జిదులో రోజు ఐదు పూటల నమాజులు జరుగుతూ వస్తున్నాయి. ఈ ఆస్తి వక్ఫ్ బోర్డు క్రింద రిజిష్టరైన ఆస్తి.

హఠాత్తుగా జిల్లా కలెక్టరు ఇక్కడ ముస్లిములు నమాజు చేయకుండా నిషేధాజ్ఞలు జారీ చేశాడు. ఒక హిందూత్వ సంస్థ ఫిర్యాదు మేరకు ఈ నిషేధాజ్ఞలు జారీ చేసినట్లు

తెలుస్తోంది. సీఆర్పీసీ 144 సెక్షన్ క్రింద నిషేధాజ్ఞలు జారీ చేయడం జరిగింది. మస్జిదు వివాదాస్పదమయ్యిందని, అందువల్ల అక్కడ పోలీసు బలగాలను మోహరించి, తహసిల్దారును అక్కడి వ్యవహారాల చార్జి తీసుకోవాలని ఆదేశించాడు. ఈ నిషేధాజ్ఞలను ఔరంగాబాద్ హైకోర్టు బెంచ్ లో సవాలు చేయడం జరిగింది. ఔరంగాబాద్ బెంచ్ ఈ నిషేధాజ్ఞలను తొలగించింది, కాని ఈ 800 సంవత్సరాల పాత మస్జిదు వివాదాస్పద కట్టడంగా మార్చే ప్రక్రియ మతతత్వ శక్తులు ప్రారంభించాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బాంబే హైకోర్టు ఔరంగాబాద్ ధర్మాసనం ఈ నిషేధాజ్ఞలపై స్టే విధించింది. జుమా మస్జిదు తరపున కేసు వాదించిన అడ్వకేట్ యస్.యస్.కాజీ క్లారియన్ వార్తాసంస్థతో మాట్లాడుతూ మస్జిదు నమాజులను కోర్టు పునరుద్ధరించిందని, జిల్లా కలెక్టరు ఉత్తర్వులపై స్టే ఇచ్చిందని తెలిపారు. జులై 11వ తేదీన జిల్లా కలెక్టరు ఈ మస్జిదులో నమాజును నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మస్జిదు రిజిష్టరైన వక్ఫ్ ఆస్తి. 1861 సంవత్సరం నుంచి ఈ మస్జిదులో నమాజులు జరుగుతున్న ఆధారాలు కోర్టుకు నివేధించడం జరిగింది. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ మస్జిదును ప్రాచీన, చారిత్రక కట్టడంగా గుర్తించింది. ప్రభుత్వం కాపాడవలసిన కట్టడాల జాబితాలో ఇది ఉన్నది. ఈ మస్జిదు యాజమాన్యం ట్రస్టుకు, ప్రభుత్వానికి ఉమ్మడిగా ఉంది. పాలనాయంత్రాంగానికి, ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు ఇక్కడ నమాజులపై ఎలాంటి అభ్యంతరాలు లేవని చెప్పే పత్రాలు కూడా ఉన్నాయని అడ్వకేట్ కాజీ వివరించారు. మస్జిదు ట్రస్టు ఈ చారిత్రక కట్టడాన్ని కాపాడే పూర్తి ప్రయత్నాలు చేస్తోంది. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నుంచి కూడా ఎన్నడూ ఎలాంటి ఫిర్యాదులు లేవు. ప్రభుత్వం నుంచి కూడా ఎన్నడూ ఎలాంటి ఫిర్యాదులు లేవు. కాని హఠాత్తుగా ఒక కొత్త సంస్థ పేరుతో ఆరెస్సెస్, విహెచ్పీ కార్యకర్త ఒకరు చేసిన ఫిర్యాదుతో నమాజులపై నిషేధం విధించడం న్యూ ఇండియాలోనే సాధ్యమయ్యింది.

ఈ మస్జిదు శతాబ్దాల చరిత్ర కలిగిన మస్జిదు. హఠాత్తుగా దీనిపై వివాదం మొదలయ్యింది. నిజానికి 1980 దశకానికి ముందు బాబరీ మస్జిదు వివాదం గురించి దేశంలో చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు. దక్షిణాది రాష్ట్రాల్లో బహుశా ఎవ్వరికీ దీని గురించి తెలియదు. కాని ఆ తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలుసు. ఇప్పుడు ఇలాంటి మరిన్ని వివాదాలను రాజేసే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి.

రిజిస్ట్రేషన్ కూడా లేని ఒక సంస్థ, "పాండవవాడ సంఘర్ష్ సమితి" అనే సంస్థ ఈ మస్జిదుపై ఒక ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు చేసిన వ్యక్తి పేరు ప్రసాద్ మధుసూదన్ దండావతే. జల్గాంవ్ జిల్లా కలెక్టరు అమన్ మిట్టల్‌కు ఈ ఫిర్యాదు పంపించాడు. మే నెలలో ఈ ఫిర్యాదు కలెక్టరుకు అందింది. ఈ ఫిర్యాదు చేసిన వ్యక్తి మధుసూదన్ దండావతె ఆరెస్సెస్ సభ్యుడిగా అతని ఫేస్ బుక్ ప్రొఫైల్ చెబుతుందని ది వైర్ వార్తా సంస్థ రాసింది. ఆరెస్సెస్‌లోనే కాదు, విశ్వ హిందూ పరిషద్, భజరంగ్ దళ్ సంస్థల్లోను ఇతనికి సభ్యత్వం ఉంది. ఈ మస్జిదు ఒక హిందూ ఆరాధనాలయం స్థలంలో కట్టారు కాబట్టి ఇది అక్రమమైనదని, దీన్ని వెంటనే అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఫిర్యాదులో కోరాడు. ఈ జుమా మస్జిదు ట్రస్ట్ ఆ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకుందని చెప్పాడు.

జుమా మస్జిదు ట్రస్ట్ సభ్యులను దివైర్ వార్తా సంస్థ కదిలించినప్పుడు వాళ్ళు ఏమన్నారంటే జూన్ నెలలో తమకు నోటీసు వచ్చిందని, అప్పటి వరకు అస్సలు ఈ విషయమేదీ తమకు తెలియదని చెప్పారు. అప్పటికి కలెక్టరు గారు ఈ ఫిర్యాదు విషయంలో విచారణ చేస్తున్నాడు. కాని ఎవరి గురించి విచారణ చేస్తున్నాడో వారికి మాత్రం ఈ విషయాలేమీ చెప్పలేదు. జులై 11వ తేదీన చాలా స్వల్ప సమయం ఇచ్చి జుమా మస్జిదు ట్రస్ట్ నుంచి వివరణ కోరారు. ఆ వెంటనే నిషేధాజ్ఞలు జారీ చేశారు.

మస్జిదు కమిటీతో పాటు వక్ఫ్ బోర్డు, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాలకు కూడా కలెక్టరు నోటీసులు పంపించేశారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఈ విషయమై ప్రతిస్పందిస్తూ మస్జిదు ట్రస్టు వాదనను సమర్థించింది. ఇది చాలా పురాతన కట్టడమని పేర్కొంది. ఈ కట్టడం విషయంలో ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రమేయం 1986 నుంచి ప్రారంభమైంది. అప్పటి నుంచి నమాజులు అక్కడ జరుగుతూనే ఉన్నాయని తెలియజేసింది. ప్రాచీన కాలం నుంచి ఈ మస్జిదును ముస్లిములు నమాజుల కొరకు ఉపయోగిస్తున్నారని కూడా చెప్పింది. వక్ఫ్ బోర్డు డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జునైద్ సయ్యాద్ బోర్డు ప్రతిస్పందన తెలియజేస్తూ వక్ఫ్ ఆస్తులకు సంబంధించి వివాదాల్లో వక్ఫ్ బోర్డు కాకుండా మరే ప్రభుత్వ విభాగం కూడా జోక్యం చేసుకునే వీలులేదని సంబంధిత చట్టాన్ని

ఉటంకించినట్లు తెలుస్తోంది. వక్ఫ్ చట్టాన్ని ప్రస్తావిస్తూ వక్ఫ్ బోర్డు కలెక్టరుకు ఈ వివాదంపై విచారణ నిర్వహించే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించింది. ఆ మస్జిదు వద్ద నిషేధాజ్ఞలు జారీ చేయడం ద్వారా కలెక్టరు వక్ఫ్ ట్రిబ్యునల్ పనుల్లో జోక్యం చేసుకున్నారని, ఇది ఆయన అధికారాలను అతిక్రమించడమేనని వక్ఫ్ బోర్డు ప్రతినిధులు అంటున్నారు. ఇక్కడ శాంతిభద్రతల పరిస్థితులేమైనా తలెత్తితే కలెక్టరు పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నించడం చేయవచ్చు, వివాదానికి సంబంధించిన అధికారాలన్నీ వక్ఫ్ బోర్డుకు మాత్రమే ఉంటాయని స్పష్టం చేశారు. నిజానికి వక్ఫ్ బోర్డు ఈ విషయాన్ని ముందుగానే కలెక్టరుకు తెలియజేసిందని, అయినా కలెక్టరు పట్టించుకోకుండా తన అధికారాలను అతిక్రమించి నిషేధాజ్ఞలు జారీ చేశారని అన్నారు.

మస్జిదు ట్రస్టు ఈ నిషేధాజ్ఞలను కోర్టులో సవాలు చేసింది. స్వతంత్రానికి పూర్వం నాటి పత్రాలను కూడా ఆధారాలుగా చూపించింది. బ్రిటీష్ ఇండియన్ గవర్నమెంటు ఉన్నప్పటి కోర్టు ఉత్తర్వులను కూడా చూపించింది. 1960 తర్వాత కూడా అనేక సందర్భాల్లో డాక్యుమెంట్లు అప్డేట్ చేయడం జరిగింది. చారిత్రక మస్జిదుగా ఇది గుర్తింపు పొందింది. అంతేకాదు, మస్జిదు ట్రస్టు ప్రతినిధులకు తమ వాదన వినిపించే అవకాశం కూడా కలెక్టరు ఇవ్వలేదని వారన్నారు. ఎవరో ఒక ఫిర్యాదు చేసిన సాకుతో నిషేధాజ్ఞలు జారీ చేశారు.

ఈ మస్జిదు మహారాష్ట్రలోని జల్గాంవ్ జిల్లాలో ఉన్న ఇరాందోల్ పట్టణంలో ఉంది. మస్జిదు నిర్మాణం ఒక మందిరంలా ఉంది కాబట్టి ఇది మందిరమేనని, దీన్ని గుడిగా గుర్తించాలని దండావతె అనే ఆరెస్సెస్ వ్యక్తి చేసిన ఫిర్యాదు సాకుతో కలెక్టరు వెంటనే అత్యుత్సాహంగా నిషేధాజ్ఞలు విధించడం ఏం సూచిస్తోంది?

ఇరాందోల్ పట్టణం అంజనీ నది ఒడ్డున ఉంది. ముంబయి మహానగరానికి 350 కి.మీ. దూరంలో ఉంది. పాండవవాడ సంఘర్ష్ సమితి అనే సంస్థకు చెందిన మధుసూదన్ దండావతె ఈ మస్జిదు నిర్మాణం గుడిలా ఉంది కాబట్టి ఇది గుడేనంటూ ఫిర్యాదు చేశాడు. మస్జిదులో నమాజును నిషేధిస్తూ జల్గాంవ్ కలెక్టరు మస్జిదు తాళాలను ఇరాందోల్ మునిసిపల్ కౌన్సిల్ చీఫ్ ఆఫీసర్ కు అప్పజెప్పాలని నోటీసు పంపించాడు.

హిందూత్వ సంస్థలు ఈ మస్జిదును వివాదాస్పదం చేయడానికి 1980 నుంచి ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాయి. పాండవులు అరణ్యవాసంలో ఇక్కడ కొంతకాలం గడిపారని, ఈ కట్టడం వారికి సంబంధించిందని వాదిస్తున్నారు. ఇలాంటి వాదనలే బాబరీ మస్జిదు వివాదం వెనుక కూడా మనకు కనిపిస్తాయి. 1980ల్లో బాబరీ మస్జిద్ వివాదం గురించి ఎవరికీ తెలియదు. కాని తర్వాత నెమ్మదిగా ఈ వివాదం గురించి పూర్తి దేశానికి తెలిసేలా చేశారు. బాబరీ వివాదం ప్రారంభమైంది కూడా మస్జిదులో విగ్రహాలను తీసుకెళ్ళి అర్ధరాత్రి ఉంచడం ద్వారా ప్రారంభించారన్నది అందరికీ తెలిసిన విషయమే. ఇప్పుడు ఇరాందోల్ పట్టణంలో ఈ ప్రాచీన మస్జిదును వివాదాస్పదం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇలాంటి ప్రయత్నాలే జ్ఞానవాపి మస్జిదు విషయంలోనూ జరుగుతున్నాయి. అక్కడ శివలింగం ఉందంటూ ప్రచారం మొదలు పెట్టారు.

మస్జిదులపై కన్నేసి గుడిని కూల్చి మస్జిదు కట్టారని వాదించడం ఇప్పుడు ఎక్కడ విన్నా వినిపించే మాటగా మారింది. గత సంవత్సరం గార్డియన్ పత్రికలో హన్నా ఎల్లిస్ పీటర్సన్ ఈ విషయమై ఒక వ్యాసాన్ని రాశారు. ఆ వ్యాసంలో చాలా వివరాలున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని బదాయూ పట్టణంలో షమ్సీ జామా మస్జిదు ఉంది. ఈ మస్జిదు కూడా దాదాపు 800 సంవత్సరాల చరిత్ర కలిగిన మస్జిదు. ఇది హిందువుల గుడి అని, మస్జిదుగా మార్చేశారన్న వాదనలు మతతత్వ శక్తులు వినిపిస్తుంటాయి. 1856 నుంచి ఈ మస్జిదుకు సంబంధించిన రికార్డులున్నాయి. కాని రికార్డులుంటే ఏం లాభం, జల్గాంవ్ మస్జిదు రికార్డులున్నాయి. అయినా కలెక్టరు నిషేధాజ్ఞలు జారీ చేయడానికి ఏవీ అడ్డంకులు కాలేదు. బదాయూ పట్టణంలోని మస్జిదుపై కూడా కోర్టు కేసు వేశారు. మస్జిదు డోమ్ లోపల కమలం పువ్వు పెయింటు ఉందని, మస్జిదులో ఒక రహస్య గదిలో విగ్రహాలను పాడేశారని ఇలాంటి చాలా కథలు వినిపిస్తున్నాయి. మస్జిదు డోమ్ లోపల ఉన్నది దివ్యఖుర్ఆన్ కాలీగ్రఫీ అని, మస్జిదులో రహస్య గదులేవీ లేవని గార్డియన్ పత్రికలో ఈ వ్యాసం రాసిన హన్నా ఎల్లీస్ పీటర్సన్ తాను వెళ్ళి చూసిన విషయాలు రాశారు. ముస్లిముల పాలనా కాలంలో హిందువులపై దౌర్జన్యాలు చేశారని, గుడులను మస్జిదులుగా మార్చేశారని వాదించేవారు చాలా మంది ఉన్నారు.

బదాయూ పట్టణంలోని ఈ మస్జిదే కాదు మొత్తం 3000 మస్జిదుల జాబితా తమ వద్ద ఉందంటూ మతతత్వ శక్తులు గతంలో చాలాసార్లు ప్రకటించారన్నది గుర్తుంచుకోవాలి.

2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాతి నుంచి ముస్లిములపై అణిచివేతలు పెరుగుతున్నాయని ఇప్పటికే చాలా మంది విమర్శిస్తున్నారు. చరిత్రను మార్చేసే ప్రయత్నాలు మరోవైపు జరుగుతున్నాయి. మొగల్ పాలనా కాలాన్ని అంధకారంగా చిత్రించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇంకోవైపు దేశవ్యాప్తంగా వివిధ మస్జిదులను వివాదాస్పదం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆరాధనాలయాల చట్టం ఉన్నప్పటికీ కోర్టులు కేసులను అనుమతిస్తున్నాయి. చివరకు షాజహాన్ కట్టించిన తాజ్ మహల్ పై కూడా కేసు వేశారు. ఇది హిందువులు పూజలు చేసుకునే గుడి అన్నారు. 2019లో సుప్రీంకోర్టు బాబరీ మస్జిదును హిందువులకు అప్పగించిన తీర్పు తర్వాతి నుంచి ఈ ధోరణి మరింత పెరిగింది. 2022లో గుర్గాంవ్‌లోని భోరాకలాన్ ఊరిలో ఒక మస్జిదుపై దుండగుల గుంపు దాడి చేసింది. దాదాపు 200 మంది దాడి చేసి లోపల ప్రార్థనలు చేస్తున్న వారిని భయభ్రాంతులకు గురి చేశారు. అక్కడ నమాజులు చేస్తున్న వారిని ఊరి నుంచి బహిష్కరిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే కర్నాటకలో గత సంవత్సరం ఒక మదరసాలో మతతత్వ దుండగుల గుంపు చొరబడి విగ్రహాలను అక్కడ బలవంతంగా ఉంచి పూజలు చేసింది. ఈ సంఘటన బీదరులో జరిగింది.

మధురలో 1670లో ఔరంగజేబు కట్టించిన షాహీ ఈద్గా పై 12 కేసులున్నాయిప్పుడు. అది శ్రీకృష్ణుడు జన్మించిన ప్రదేశమని వాదిస్తున్నారు. హిందువుల గుడిని కూలగొట్టి మస్జిదు కట్టారని వాదిస్తున్నారు. వారణాసిలో జ్ఞానవాపీ మస్జిదు ఒక శివాలయం అని, దాన్ని కూల్చి మస్జిదు కట్టారని అక్కడ ఒక శివలింగం ఉందంటూ కొందరు మహిళలు పూజలు చేసుకునే అనుమతి ఇవ్వాలని కోర్టుకు వెళ్ళారు. ఆ కేసు గత సంవత్సరం వార్తల్లో ప్రధానంగా నిలిచింది.

కోర్టు కేసులతో వివాదాలు సృష్టించడం ఒకవైపు కొనసాగుతుంటే మరోవైపు కూల్చివేతలు కూడా కొనసాగుతున్నాయి. ప్రయాగరాజ్ గా ఇప్పుడు పేరు మార్చబడిన అలహాబాద్ పట్టణంలో 16వ శతాబ్దానికి చెందిన షాహీ మస్జిదును జనవరిలో కూలగొట్టారు. రోడ్డు విస్తరణ పేరుతో బుల్డోజర్లు తీసుకొచ్చి కూల్చివేత నిర్వహించారు. నిజానికి శతాబ్దాల చరిత్ర ఉన్న ఒక కట్టడాన్ని కూలగొట్టడం మరో దేశంలో అయితే ఎంతో సంచలనానికి కారణమయ్యేది, కాని ఉత్తర ప్రదేశ్ లో ఇప్పుడు బుల్డోజర్లు నిర్మాణాలను కూలగొట్టడం అనేది సర్వసాధారణం. అందువల్ల ఇది వార్తల్లో కూడా పెద్దగా కనిపించలేదు. గత సంవత్సరం నవంబరులో 300 సంవత్సరాల చరిత్ర కలిగిన మస్జిదును కూడా కూల్చారు. ఉత్తరప్రదేశ్ లోని ముజఫ్ఫర్ నగర్ జిల్లాలోని ఈ మస్జిదును కూడా రోడ్డు విస్తరణ కోసం కూలగొట్టారు.

మస్జిదులపై కోర్టు కేసులు, రోడ్డు విస్తరణ కోసం కూల్చివేతలు, ముస్లిం పేర్లున్న ప్రాంతాల పేర్లు మార్చడం, ముస్లిం పాలకుల చరిత్రను వక్రీకరించడం, సిలబసు నుంచి తొలగించడం, హరిద్వార్ ధర్మసంసద్, ఢిల్లీ స్టేడియంలలో బాహాటంగా ముస్లిములపై హింసాదౌర్జన్యాలకు పిలుపునివ్వడం, లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్, యుపియస్సీ జిహాద్, టమాటా జిహాద్, ఎరువుల జిహాద్ (ఫర్టిలైజర్ జిహాద్), కరోనా జిహాద్... ఈ జాబితా కూడా చాలా పెద్దదే, ఇవే దేశంలో ఇప్పుడు వినిపిస్తున్న, కనిపిస్తున్న పరిస్థితులు.

### కొసమెరుపు:

భారత ప్రధాని నరేంద్రమోడీ అమెరికాలో మాట్లాడుతూ దేశంలో కులమత వివక్ష పక్షపాతాలనేవి మచ్చుకు కూడా లేవని అన్నారు. అమెరికా నుంచి వస్తూ కైరోలో వెయ్యేళ్ళ చరిత్ర కలిగిన మస్జిదును సందర్శించారు. ✤


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana


Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**



# రాయ్ అహ్మద్ నవాజ్ ఖాన్ ఖారల్

## (1776-1857)

**8**






**9440241727**

**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త సయ్యిద్ నశీర్ అహమ్మద్ రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**

ఆంగ్లేయాధికారుల ఆధిపత్యాన్ని సహించక పోరుబాటు ఎన్నుకుని అమరత్వం పొందిన రాయ్ అహ్మద్ నవాజ్ ఖాన్ ప్రస్తుత పాకిస్థాన్‌లో భాగమైన పంజాబ్ రాష్ట్రంలోని ఫైసలాబాద్ జిల్లా ఝూమ్రా గ్రామంలో 1776లో జన్మించారు. సంపన్న భూస్వామ్య కుటుంబానికి చెందిన అహ్మద్ ఖాన్ యువకుడిగా మహారాజా రంజిత్ సింగ్ ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా పోరాడారు. 1857లో ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులలో భయోత్పాతం సృష్టించిన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామ యోధులను నిలువరించేందుకు ఆంగ్లేయాధికారులు ఖారల్ తెగ సహకారాన్ని అర్థించారు. అందుకు అంగీకరించని ఖారల్ ప్రజల మీద అధికారులు నిర్బంధాలకు, దాష్టికాలకు పాల్పడ్డారు. ఆ చర్యల పట్ల ఆగ్రహించిన రాయ్ అహ్మద్ నవాజ్ ఖాన్ ఖారల్ ఆంగ్లేయులను అడ్డుకోవడానికి నడుం కట్టారు. ఆంగ్లేయులతో పోరు తప్పదన్న నిర్ణయానికి వచ్చిన అహ్మద్ ఖాన్ తన ప్రజలతో ప్రత్యేక పోరాట దళాన్ని ఏర్పాటు చేసుకుని ఆంగ్లేయ సైనిక శిబిరాలను తమ గెరిల్లా పోరాట పద్ధతులతో చికాకు పర్చారు. అనంతరం సాహివాల్ జిల్లాలోని గొగెరా కారాగారం మీద 1857 జూలై 26న సాహసోపేత దాడి జరిపి అక్కడ బందీలుగా ఉన్న ప్రజలను బంధ విముక్తులను చేశారు. ఈ చర్యతో ఆంగ్లేయాధికారి లెఫ్టినెంట్ గవర్నర్ లార్డ్ బెర్కిలీ మండిపడ్డాడు. ఆ ప్రాంతంలో ప్రజల నివాసాల మీద పడి విధ్వంసం సృష్టించాడు. పోరాట యోధుడు రాయ్ అహ్మద్ నవాజ్ ఖాన్‌ను నిర్బంధించేందుకు ఎత్తులు వేస్తూ, కుయుక్తులు పన్నుతూ ప్రయత్నాలు ప్రారంభించాడు. ఆంగ్లేయులకు చిక్కకుండా అటవీ ప్రాంతంలో ఉంటూ ఆంగ్లేయ సైనిక శిబిరాల మీద దాడులకు సిద్ధమవుతున్న రాయ్ అహ్మద్ నవాజ్ ఖాన్ వ్యూహాలను, రహస్యాలను ఆయన దాయాది కమాలియా ప్రాంతానికి చెందిన సర్ఫ్రాజ్ ఖాన్ అను విద్రోహి ఆంగ్లేయాధికారి బెర్కలీకి చేరవేశాడు. ఆ రహస్య సమాచారంతో పోరాట యోధుల కదలికల మీద కన్నేసి, పకడ్బందీగా వలపన్ని రాయ్ అహ్మద్ నవాజ్ కోసం గష్కోరి అటవీ ప్రాంతాన లార్డ్ బెర్కలీ మాటువేశాడు. ఈ పరిణామాలేవి ఎరుకలో లేని అహ్మద్ నవాజ్ ఖాన్ ఆంగ్లేయ శిబిరాల మీద దాడులకు సిద్ధమవుతున్న తరుణంలో, పోరాటయోధుల రహస్య స్థావరాన్ని కనిపెట్టిన లార్డ్ బెర్కలీ ఆకస్మిక దాడి చేసి కాల్పులు జరిపాడు. ఆ దాడిని వీరోచితంగా ఎదుర్కొంటూ పోరాడిన రాయ్ అహ్మద్ నవాజ్ ఖాన్ ఖారల్ 1857 ఆగస్టు 30న అమరుడయ్యారు.

✤ ✤ ✤




# టీం ఇండియా

**నల్లటి టీ షర్టు ధరించిన** రాష్ట్రీయ జనతాదళ్ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ తన వయసు కన్నా తక్కువగా కనిపిస్తున్నారిప్పుడు. ఆరోగ్యంగా కనిపిస్తున్నారు. ఆసుపత్రి లోను, జైల్లోను చాలా కాలం గడిపినప్పటికీ హుషారుగా కనిపిస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేటు నిరంతరం ఆయన కుటుంబాన్ని వెంటాడుతున్నప్పటికీ, వేధింపులకు గురవు తున్నప్పటికీ అవేమీ పట్టించుకోనట్లు కనిపిస్తున్నారు. ఎంతో హుషారుగా కాంగ్రెసు మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీని పలకరిస్తూ కనిపించారు. ఇదంతా బెంగుళూరులో జరిగిన ప్రతిపక్ష సమావేశంలోని దృశ్యాలు. లాలూ ప్రసాద్ యాదవ్‌లో గతంలో కనిపించే చురుకుదనం మరోసారి కనిపిస్తోంది. ప్రతిపక్ష నేతలందరిపై ఆ ప్రభావం కూడా కనిపించింది.

పాట్నాలో జూన్‌లో చాలా మంది ప్రతిపక్ష నేతలు సమావేశ మయ్యారు. అందులో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశానికి పాట్నా వచ్చిన మమతాబెనర్జీ అక్కడ ఎయిర్ పోర్టులో దిగగానే తిన్నగా ముందు లాలూ యాదవ్ ఇంటికే వెళ్ళారు. అంతకు ముందు లాలూ యాదవ్ చాలా సరదాగా రాహుల్ గాంధీతో పెళ్ళి గురించి ఆలోచనేమైనా ఉందా లేదా అని జోకులేశారు. పాట్నాలోనే బెంగుళూరు సమావేశం తేదీ నిర్ణయమై పోయింది. ప్రతిపక్ష సమైక్యత కోసం జరుగుతున్న ప్రయ త్నాల్లో భాగంగా బెంగుళూరులో మరోసారి 26 పార్టీల నేతలు సమావేశమయ్యారు. సామాజిక న్యాయం, ప్రగతీ వికాసాలు జాతీయ సంక్షేమం లక్ష్యాలుగా ఈ పార్టీలు ఒక్కటవుతు న్నాయి. రెండు రోజుల పాటు ఈ సమావేశం జరిగింది. సారూప్య భావాలున్న పార్టీలు కలిసి పని చేస్తాయని కాంగ్రెసు అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడడానికి ఇది చాలా ముఖ్యమైన సమావేశ మని ఖర్గే చెప్పారు. ఈ సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారని చెప్పారు. ఈ కూటమి పేరు ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూసివ్ అలయెన్స్ సంక్షిప్తంగా ఇండియా అని ప్రకటించారు.

తర్వాతి సమావేశం ముంబయిలో జరగబోతోంది. ఆ సమావేశంలో 11 మంది సభ్యుల కోఆర్డినేషన్ కమిటీని ప్రకటిస్తామన్నారు. ఈ కూటమికి ఇండియా అని పేరు పెట్టిన వెంటనే రాజకీయంగా గగ్గోలు మొదలయ్యింది. బీజేపీ నేతలు ఎవరికి తోచిన వ్యాఖ్యలు వాళ్ళు చేయడం మొదలు పెట్టారు. ఇండియా అనే పేరు బ్రిటీషు వారు పెట్టిన పేరని, బ్రిటీషు వలసపాలన చిహ్నమని, దేశానికి భారత్ అనేదే అసలు పేరంటూ అస్సాం ముఖ్యమంత్రి బీజేపీ నేత హేమంత బిశ్వ శర్మ ప్రకటించాడు. ఆయన సోషల్ మీడియా ఖాతాల్లో బీజేపీ ఫర్ ఇండియా అని ఇంత వరకు ఉండేది ఇప్పుడు మార్చేసి బీజేపీ ఫర్ భారత్ అని పెట్టుకున్నాడు. కాని ఇండియా అనేది బ్రిటీషు వారు పెట్టిన పేరని ఈసడించే దయితే ఎక్కడెక్కడ ఈ పేరును మార్చగలం? రాజ్యాంగంలో కూడా ఇండియా అనే పేరే ఉంది. అనేక పార్టీల పేర్లలో

ఇండియా అన్న పదమే ఉంది. కేంద్ర ప్రారంభించిన స్టార్టప్ ఇండియా, మేకిన్ ఇండియా, ఖేలో ఇండియా ఇలా అనేక వాటిల్లో ఇండియా అనే పేరే ఉంది. భారత ప్రధానిని ప్రైం మినిస్టర్ ఆఫ్ ఇండియా అనే అంటున్నాం. వివిధ దేశాలు కూడా ఇలాగే పిలుస్తున్నాయి. ఎక్కడెక్కడ ఇండియా అనే పేరు తీసి భారత్ అనే పేరు పెట్టాలో హేమంత బిశ్వ శర్మ చెప్పలేదు. ఫెర్టిలైజర్ జిహాద్ అనే కొత్త జిహాద్ కనిపెట్టిన హేమంత బిశ్వ శర్మ జవాబు కోసం చాలా మంది ఎదురు చూస్తున్నారు. ఈ లోగా ఇండియా అనే పేరు పెట్టడం చట్టరిత్యా నేరమంటూ ఈ 26 పార్టీలపై పోలీసు కేసు కూడా ఒక చోట నమోదైంది. కాని ఇండియా అనేది సంక్షిప్త నామం. కూటమి మొత్తం పేరులో కూడా ఇండియా అనే పదం ఉంది, కాని దేశంలోని చాలా పార్టీల పేర్లలో ఇండియా అనే పదం ఉంది. కాబట్టి ఈ పోలీసు కేసు కోర్టు వరకు వెళుతుందా? ఉన్నత న్యాయస్థానాల వరకు వెళుతుందా? కోర్టులు దీనిపై ఎలాంటి తీర్పు ఇస్తాయన్న ఉత్కంఠ కూడా మరోవైపు ఉంది.

బీజేపీ నేతలు కార్యకర్తల్లో ఈ కంగారు, కలవరం ఎందుకుని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. బెంగుళూరు సమావేశం తర్వాత మమతాబెనర్జీ మాట్లాడుతూ రాహుల్ గాంధీపై ప్రశంసల వర్షం కురిపించారు. ఇండియాను సవాలు చేసే శక్తి బీజేపీకి ఉందా అంటూ గర్జించారు. రాబోయే రోజుల్లో రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారబోతున్నాయన్నది ఈ ప్రతిపక్ష సమావేశం తర్వాత స్పష్టంగా అర్థమయ్యింది. మమతా బెనర్జీ ఎలాంటి శషబిషలు లేకుండా తామే అసలైన దేశభక్తులమని, రైతుల కోసం, దళితుల కోసం, దేశం కోసం పనిచేస్తున్నది తామేనంటూ ప్రకటించారు. ఈ సారి ఎన్నికల్లో ఇండియా గెలుస్తుందని, బీజేపీ ఓడిపోతుందని అన్నారు. ప్రతిపక్ష కూటమికి ఇండియా అని పేరు పెట్టిన తర్వాత సోషల్ మీడియాలో ఆసక్తికరమైన పోస్టుల కూడా కనిపించాయి. ఓట్ ఫర్ ఇండియా అంటూ గతంలో ప్రధాని మోడీ చేసిన ప్రసంగాన్ని ఇప్పుడు కొందరు ప్రచారంలో పెట్టారు.

ప్రస్తుతం దేశంలో లౌకిక ప్రజాస్వామిక విలువలను కాపాడు కోవలసిన అవసరం ఉందని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ కూటమిలోకి వచ్చారు. కాంగ్రెసు ట్విటరు హ్యాండిల్ పై అరవింద్ కేజ్రీవాల్ పోస్టు రావడం ఒకప్పుడు ఊహించలేని విషయం. అది కూడా ఇప్పుడు కనిపించింది. పాట్నాలో 16 పార్టీలు ఒక్కట య్యాయి. ఇప్పుడు సంఖ్య పెరిగి 26కు చేరుకుంది. మోడీ తొమ్మిది సంవత్సరాల పాలనలో ఒక్క రంగం కూడా అభివృద్ధి చెందలేదు. ఐదారేళ్ళ క్రితం వరకు రైల్వేలు బాగానే పని చేసేవి. ఇప్పుడు కూలబడ్డాయి. కేంద్ర ప్రభుత్వం అన్ని అమ్మేస్తుందంటూ కేజ్రీవాల్ మండిపడ్డారు.

మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన నేత ఉద్ధవ్ థాక్రే మాట్లాడుతూ ఒక వ్యక్తి మొత్తం దేశంగా మారడం ఎన్నటికీ జరగదని అన్నారు. పాట్నాలో ప్రతిపక్ష సమావేశాన్ని బీహారు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు బెంగుళూరు సమావేశాన్ని కాంగ్రెసు పార్టీ ఏర్పాటు చేసింది. ఖర్గే, రాహుల్ గాంధీలు అందుబాటులో లేనందువల్ల ఈ సమావేశాన్ని కొన్ని రోజుల పాటు వాయిదా వేయడానికి ప్రతి పక్షాలు ఒప్పుకోవడం కూడా గమనార్హమైన విషయం. భారత్ జోడో యాత్ర, కర్నాటక ఎన్నికల విజయం తర్వాత రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ఇప్పుడు ప్రతిపక్ష కూటమికి ఇండియా సంక్షిప్తనామం పెట్టి రాహుల్ గాంధీ మాస్టర్ స్ట్రోక్ కొట్టారని చాలా మంది విశ్లేషకుల అభిప్రాయం. ఈ అభిప్రాయం నిజమే అన్నట్లు బీజేపీలో కంగారు కూడా కనిపిస్తోంది. ఇప్పటి వరకు ఎన్డీయే మిత్రపక్షాల సమావేశం ఎన్నడూ ఏర్పాటు చేయని బీజేపీ ఇప్పుడు ఎన్డీయే సమావేశం ఏర్పాటు చేసింది.

కర్నాటకలో కాంగ్రెసు సాధించిన విజయం ఒక్క రాష్ట్రంలో సాధించిన విజయమే అయినప్పటికీ బీజేపీకి లోక్ సభ ఎన్నిక లకు ముందు చావుదెబ్బ కొట్టినట్లయ్యింది. కర్నాటక ఎన్నికల్లో భజరంగ్ భళీ నినాదాలు, ముస్లిముల పట్ల విద్వేష ప్రసంగాలు ఏవీ పనిచేయలేదు. ఇంతకు ముందు బెంగాల్ ఎన్నికల్లోను ఇదే జరిగింది. మరోవైపు మణిపూర్ హింసాకాండ వల్ల ఈశాన్య రాష్ట్రాల్లోను వ్యతిరేకత పెరుగుతోంది. మరోవైపు ఢిల్లీ వీధుల్లో మహిళా మల్లయోధులు, అంతర్జాతీయంగా దేశానికి మెడల్స్ సాధించి పెట్టిన క్రీడాకారిణులు బీజేపీ నేతకు వ్యతిరేకంగా ప్రదర్శనలకు దిగిన సంఘటనలు కూడా బీజేపీ ప్రతిష్ఠను మట్టిలో కలిపాయి. మణిపూర్ హింసాకాండ తర్వాత రాహుల్ గాంధీ మణిపూర్ పర్యటించారు. అక్కడ శిబిరాల్లో తలదాచుకున్న బాధితులతో కలిసి మాట్లాడారు. వారి పిల్ల లతో కలిసి భోజనం చేశారు. అదే సమయంలో ప్రధాని మోడీ విదేశాల్లో విహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జరిగిన బెంగుళూరు సమావేశంలో కూడా మణిపూర్ చర్చ వచ్చింది. అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని మణిపూర్ పంపించాలని నిర్ణయించారు.

ప్రతిపక్ష సమైక్యత ఒక్కసారిగా సాధ్యపడలేదు. నిజానికి దీని వెనుక బీహారు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ చొరవ చాలా ఉంది. కాంగ్రెసు నేతలతోను, ప్రాంతీయ పార్టీల నాయకుల తోను ఆయన నిరంతరం సంప్రదింపులు జరిపారు. మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, అరవింద్ కేజ్రీవాల్ తదితర నేతలను ఒక్క తాటిపై తీసుకువచ్చే ప్రయత్నాలు చేశారు. మరోవైపు కాంగ్రెసు పార్టీ కూడా గతానికి భిన్నంగా అందరినీ కలుపుకు వెళ్ళే ధోరణి ప్రదర్శించింది. కేజ్రీవాల్‌కు రాజ్య సభలో అవసరమైన మద్దతు ఇవ్వడానికి ఒప్పుకుంది. ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వం అధికారాలకు కోత పెట్టే ఆర్డినెన్సు విషయంలో కేజ్రీవాల్ కు పూర్తి మద్దతు ప్రకటించింది.

బీజేపీకి ఇప్పటికి కూడా రాజ్యసభలో మెజారిటీ లేదు. ఇటీవల విదేశాంగ మంత్రి యస్. జైశంకర్ రాజ్యసభలో సభ్యత్వం పొందారు. అయినా కూడా బీజేపీకి పూర్తి బలం లేదు. పైగా తృణమూల్ కాంగ్రెసు ఎంపీల సంఖ్య ఆరుగురు పెరిగారు. మమతాబెనర్జీ కూడా కేజ్రీవాల్‌కు ఆర్డినెన్సు విషయంలో మద్దతిస్తున్నారు. కేంద్రం బెంగాల్ పట్ల కూడా సవతి తల్లి ప్రేమ చూపిస్తుందంటూ మండిపడ్డారు. బెంగు ళూరు సమావేవశానికి ముందు కాంగ్రెసు ఢిల్లీ ఆర్డినెన్సు విషయంలో కేజ్రీవాల్ కు మద్దతివ్వడం ద్వారా రాజకీయ పరిణతిని ప్రదర్శించింది. కాంగ్రెసు నిర్ణయం తర్వాత కేజ్రీవాల్ ప్రతిపక్ష కూటమిలో చాలా సంతోషంగా చేరాడు. నిజానికి కేజ్రీవాల్‌కు కాంగ్రెసుకు మధ్య మమతా బెనర్జీ మధ్యవర్తిత్వం పని చేసిందని కొందరంటున్నారు. నిజానికి జమ్ము కశ్మీర్‌లో అధికరణ 374 రద్దు చేసినప్పుడు కేజ్రీవాల్ కేంద్ర నిర్ణయం పట్ల సానుకూలంగా వ్యవహరించడాన్ని మహబూబా ముఫ్తీ, ఉమర్ అబ్దుల్లాలు గుర్తు చేశారు. కాని ప్రతిపక్ష సమైక్యత సాధించడానికి ఈ విభేదాలను సమయ స్ఫూర్తితో, చాకచక్యంగా పరిష్కరించడం జరిగింది. కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కే.శివకుమార్ పోషించిన పాత్ర కూడా చాలా కీలకమైనది.

ప్రతిపక్ష సమావేశంలో కూటమి పేరు, కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ తదితర విషయాలపై చర్చ జరిగింది. కాంగ్రెసు నాయకత్వ పాత్ర పోషిస్తూ పెద్దన్నగా వ్యవహరిస్తుందన్న భయాలుండేవి. కాని కాంగ్రెసు రాజకీయ పరిణతి ప్రదర్శిం చింది. కన్వీనర్ హెూదా నితీష్ కుమార్‌కు అప్పగించింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడ్డం, నిరంకుశ పోకడలను అడ్డుకోవడం ప్రతిపక్ష సమైక్యత ముఖ్య లక్ష్యాలు కాబట్టి అవసరమైన సర్దుబాట్లకు సిద్ధమే అన్నట్లు కాంగ్రెసు వ్యవహరించడం గమనించదగిన విషయం. ఫలితంగా ఒక ఏకాభిప్రాయం కుదిరింది. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న చోట్ల ఆ పార్టీ లకే ప్రాముఖ్యం ఉంటుంది. కాంగ్రెసు బలంగా ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెసుకు ప్రాధాన్యత ఉంటుంది. అంటే బెంగాల్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, బీహార్ తదితర రాష్ట్రాల్లో కాంగ్రెసు వెనక్కు తగ్గుతుంది. రాజస్థాన్, కర్నాటక, మధ్య ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో కాంగ్రెసు ముఖ్యమైన పార్టీగా కొనసాగుతుంది.

అయితే తెలంగాణ పరిస్థితిని పరిశీలిస్తే, తెలంగాణలో కాంగ్రెసు బలం పుంజుకున్న దాఖలాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో కూడా ఈ డైలమా ఉంది. తెలుగుదేశం బీజేపీతో చేతులు కలుపుతుంటే, జగన్ పార్టీ ఎటూ తేల్చుకోలేదు. ఈ రెండు రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణాలు ఎలా ఉంటాయో చూడాలి. కాగా జగన్ సోదరి షర్మిలా కాంగ్రెసుతో చేతులు కలపడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనివల్ల చంద్రబాబునాయుడుకు ఆంధ్రప్రదేశ్ లో తలనొప్పి తప్పదు. తెలంగాణలో షర్మిలా ప్రభావం గురించి ఇప్పుడే ఎవరు ఏదీ చెప్పలేని పరిస్థితి ఉంది. బీజేపీని ఢీకొనడానికే కేసీఆర్ తన పార్టీని జాతీయస్థాయిలో విస్తరించి, బీఆరెస్ అని పేరు మార్చారు. కాని ఇప్పుడు మారిన పరిస్థితుల్లో తెలంగాణలో అధికారం కాపాడుకోడానికే ప్రాముఖ్యం ఇస్తారన్నది స్పష్టం. బెంగుళూరు సమావేశానికి తెలుగుదేశం, మజ్లిస్ పార్టీలకు ఆహ్వానం అందలేదు. మజ్లిస్, బీఆరెస్ పార్టీలు బీజేపీకి బీ టీములుగా పని చేస్తాయని కొందరి విశ్లేషణ. పైగా ఈ రాష్ట్రాల్లో బీజేపికి పెద్దగా బలం కూడా లేదు. పైగా మజ్లిస్ పార్టీ మహారాష్ట్రలో కాలు మోపడానికి ప్రయత్నించడం శరద్ పవార్, ఉద్ధవ్ థాక్రే వంటి మహారాష్ట్ర నేతలకు నచ్చడంలేదు. రాహుల్ గాంధీ ర్యాలీకి తెలంగాణలో వచ్చిన భారీ ప్రతిస్పం దన కూడా మారుతున్న రాజకీయ సమీ కరణాలకు సూచన.

ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఎన్నడూ ఎన్డీయే సమావేశం నిర్వహించడానికి ఇష్టపడని బీజేపీ హఠాత్తుగా ఢిల్లీలో 40 పార్టీలతో సమావేశం నిర్వహించింది. అవినీతిపరుల ముఠా లాంటి ప్రతిపక్ష కూటమికి జవాబుగా తమ ఎన్డీయేలో చాలా పార్టీలున్నాయని చూపించుకునే ప్రయత్నాలు జరిగాయి. ఏక్నాథ్ షిండే, అజిత్ పవార్ వంటి ఇటీవల పార్టీ మార్చిన నేతలతో పాటు, అందరూ మరిచిపోయిన చిరాగ్ పాశ్వాన్ ను కూడా హఠాత్తుగా బీజేపీ ముందుకు తీసుకువచ్చింది. ఒకప్పుడు తమకు మిత్రుడిగా ఉన్న నితీష్ కుమార్‌ను దెబ్బ తీయడానికి చిరాగ్ పాశ్వాన్ ను ఉపయోగించుకున్నారు. తర్వాత తేజస్వీ యాదవ్ నచ్చచెప్పడంతో చిరాగ్ పాశ్వాన్ బీహారులో మహాఘటబంధన్ లో చేరాడు. కానీ తర్వాత చిరాగ్ పాశ్వాన్ జేడీయుకు వ్యతిరేకంగా అభ్యర్థులను

నిలబెట్టి ఎన్నికల్లో చావుదెబ్బలు తిన్నాడు. ఆ తర్వాత చిరాగ్ పాశ్వాన్ పేరు రాజకీయాల్లో వినిపించలేదు. ఇప్పుడు చిరాగ్ పాశ్వాన్ తనకు ఆరు లోక్‌సభ సీట్లు కావాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీ ఈ డిమాండ్‌కు ఒప్పుకుం టుందా?

బీజేపీ పట్ల ప్రజలు విసిగిపోయారని శరద్ పవార్ అంటు న్నారు. రాజకీయాల్లో తలపండిన శరద్ పవార్ మాటలను అంత తేలిగ్గా కొట్టిపారేయలేము. ఇప్పుడు అజిత్ పవార్ బీజేపీలో చేరడంతో శివసేనను చీల్చి బీజేపీ శిబిరంలోకి వచ్చిన ఏక్ నాథ్ షిండే పరిస్థితి అగమ్యగోచరమయ్యింది. దేవంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్ వంటి అతిరథుల మధ్య చిక్కుకుపోయాడు. ఆయనతో ఉన్న ఎమ్మెల్యేలు కూడా నేడో రేపో ఉద్ధవ్ థాక్రే వైపు వెళ్ళిపోయే పరిస్థితి తలెత్తవచ్చు. పైగా అజిత్ పవార్ ఇంతకు ముందు కూడా బీజేపీ వైపు మొగ్గు చూపి తనపై ఎన్ ఫోర్స్ మెంట్ దాడులను తప్పించు కున్నాడు. ఇప్పుడు కూడా అజిత్ పవార్ అతనితో ఉన్న ఎమ్మెల్యేలు కేంద్ర సంస్థల నుంచి తప్పించుకోడానికి మాత్రమే ఈ ఎత్తుగడ వేశారని చాలా మంది అభిప్రాయపడు తున్నారు. చివరకు అజిత్ పవార్ మళ్ళీ శరద్ పవార్ ఇంటికే తిరిగి వస్తాడని భావిస్తున్నారు.

ఏదిఏమైనా ఎన్డీయే సమావేశం సాధించింది ఏదీ కనబడలేదు. కాని ప్రతిపక్షాల కూటమికి ఇండియా అని సంక్షిప్త నామం పెట్టడం ద్వారా రాజకీయాల్లో కొత్త తుఫాను ప్రారంభమయ్యింది. రాబోయే రోజుల్లో ఈ గాలులు ఎటు నుంచి ఎటు వీస్తాయో చూడాలి. ✤


# ఖుర్‌ఆన్ అవగాహనం (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్)

**(1 నుండి 10వ సంపుటం వరకు వివరాలు )**

| సంపుటం | సూరా పేర్లు | సూరాలు | పేజీలు | హదియ |
|---|---|---|---|---|
| 1. | 1. అల్ ఫాతిహా 2. అల్ బకర 3. ఆలి ఇమ్రాన్ | 3 | 266 | 300-00 |
| 2. | 4. అన్ నిసా 5. అల్ మాఇద 6. అల్ అన్‌ఆమ్ | 3 | 268 | 300-00 |
| 3. | 7. అల్ ఆరాఫ్ 8. అల్ అన్‌ఫాల్ 9. అత్ తౌబా 10. యూనుస్ 11. హూద్ 12. యూసుఫ్ | 6 | 440 | 300-00 |
| 4. | 13. అర్ రా'ద్ 14. ఇబ్రాహీమ్ 15. అల్ హిజ్ర్ 16. అన్ నహ్ల్ 17. బనీ ఇస్రాయీల్ 18. అల్ కహ్ఫ్ 19. మర్యమ్ 20. తాహా 21. అల్ అన్బియా | 9 | 424 | 400-00 |
| 5. | 22. అల్ హజ్జ్ 23. అల్ మూ'మినూన్ 24. అన్ నూర్ 25. అల్ ఫుర్‌కాన్ 26. అష్ షుఅరా 27. అన్ నమ్ల్ | 6 | 422 | 250-00 |
| 6. | 28. అల్ కసస్ 29. అల్ అన్కబూత్ 30. అర్‌రూమ్ 31. లుక్మాన్ 32. అస్ సజ్దా 33. అల్ అహ్జాబ్ 34. సబా 35. ఫాతిర్ | 8 | 424 | 400-00 |
| 7. | 36. యాసీన్ 37. అస్‌సాఫ్ఫాత్ 38. సాద్ 39. అజ్ జుమర్ 40. అల్ మూ'మిన్ 41. హామీమ్ అస్ సజ్దా 42. అష్ షూరా 43. అల్ అహ్కాఫ్ 44. అద్ దుఖాన్ 45. అల్ జాసియహ్ 46. అల్ అహ్కాఫ్ 47. ముహమ్మద్ | 12 | 456 | 400-00 |
| 8. | 48. అల్‌ఫత్హ్ నుండి 59. అల్ హష్ర్ | 12 | 408 | 400-00 |
| 9. | 60. అల్ ముమ్తహీన నుండి 77 అల్ ముర్సలాత్ | 18 | 412 | 400-00 |
| 10. | 78 అన్ నబా నుండి 114 అన్ నాస్ వరకు | 37 | 420 | 300-00 |

TIP TRUST

**TELUGU ISLAMIC PUBLICATIONS TRUST**

**Central Bank of India, Noor Khan Bazar Branch, Hyderabad**

**A/c. No. 1042789779 IFSC Code. CBIN0282407**

**మరిన్ని వివరాలకు సంప్రదించండి: ✆ 9963498695 , 9985394757**



# ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తామన్న కేసీఆర్


**కేంద్రం**లోని బీజేపీ ప్రభుత్వం ఎప్పుడు యునిఫాం సివిల్ కోడ్ బిల్లు ప్రవేశపెట్టినా దాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ప్రగతి భవన్ లో ముఖ్యమంత్రిని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధి బృందం బోర్డు అధ్యక్షుడు ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ నాయకత్వంలో కలిసింది. ఈ సమావేశంలో మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీలు కూడా పాల్గొన్నారు. యూనిఫాం సివిల్ కోడ్‌ను పార్లమెంటులో వ్యతిరేకించడం మాత్రమే కాదు సారూప్యభావాలున్న పార్టీలతో కలిసి యూనిఫాం సివిల్ కోడ్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ విషయమై పార్లమెంటు ఉభయసభల్లో అనుసరించే వ్యూహాన్ని రూపొందించాలని పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే.కేశవరావు, నామా నాగేశ్వరరావులకు ఆయన చెప్పారు. దేశంలో బీజేపీ మతవిభజనలు ప్రోత్సహిస్తోందని, ఇప్పుడు యుసిసి పేరుతో మరోసారి విభజన రాజకీయాలు నడుపుతోందని ఆయన వ్యాఖ్యానించారు. దేశ సమైక్యత సమగ్రతను దెబ్బతీసే ఇలాంటి ప్రయత్నాలను పూర్తిగా వ్యతిరేకిస్తామని చెప్పారు. యుసిసి బిల్లు ఆదివాసీలపై ప్రభావం చూపిస్తుందని, ఆదివాసులు తమ స్వంత సంప్రదాయాలు కట్టుబాట్లను పాటిస్తారని ఆయన చెప్పారు. దేశంలోని లౌకికతత్వానికి ఇది విరుద్ధమని అన్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాభివృద్ధిని పట్టించుకోలేదని, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, ఇప్పుడు మరే సమస్య లేదన్నట్లుగా, రాజకీయ ప్రయోజనాల కోసం యూనిఫాం సివిల్ కోడ్ గురించి మాట్లాడుతోందని అన్నారు. ముఖ్యమంత్రి తమ విజ్ఞప్తికి తక్షణం స్పందించినందుకు ముస్లిం పర్సనల్ లా బోర్డు ధన్యవాదాలు తెలియజేసింది. అసదుద్దీన్ ఒవైసీ తర్వాత పాత్రికేయులతో మాట్లాడుతూ యూనిఫాం సివిల్ కోడ్ కేవలం ముస్లిముల సమస్య కాదని, క్రయిస్తవులు ఇతర మైనారిటీలకు కూడా సంబంధించిన సమస్య అని అన్నారు. మరో తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో పాలకపక్షంగా ఉన్న వైయస్సార్ సిపి, ప్రతిపక్షం తెలుగుదేశం రెండు పార్టీలు కూడా యూనిఫాం సివిల్ కోడ్ గురించి ఆచితూచి మాట్లాడుతున్నాయి. జనసేన కూడా చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఈ విషయమై ఎలాంటి వైఖరి తీసుకోవాలన్న చర్చలు ఈ పార్టీల్లో ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ముస్లిములతో పాటు వామపక్షాలు స్పష్టంగా యూనిఫాం సివిల్ కోడ్ పట్ల వ్యతిరేకతను ప్రకటించారు. కాంగ్రెసు ఈ విషయమై దృఢంగా నిలబడడం లేదని విమర్శలు కూడా వినవస్తున్నాయి. యూనిఫాం సివిల్ కోడ్ పెళ్ళి,

విడాకులు, వారసత్వం విషయాల్లో భారత పౌరులందరికీ ఒకే చట్టం వర్తించే చట్టం. మతం, కులం, తెగల ఆచారాలేవీ ఆ తర్వాత పాటించడం కుదరదు. పార్లమెంటు ఎన్నికలకు ముందు యూనిఫాం సివిల్ కోడ్ తీసుకురావాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. ముస్లిం సంస్థలు ఈ ప్రయత్నాలను తీవ్రంగా విమర్శిస్తున్నాయి. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు నడుపుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ పార్టీ యూనిఫాం సివిల్ కోడ్ విషయంలో ఎటు తేల్చలేదు. తెలుగుదేశం కూడా మెతగ్గానే ఉంది. ఈ రెండు పార్టీలు కేంద్రంలోని బీజేపీతో అనేక విషయాల్లో సహకరిస్తున్న పార్టీలు. వివిధ పౌర సంఘాలు, మత సంస్థలు, న్యాయనిపుణులు, మేధావులు యూనిఫాం సివిల్ కోడ్‌పై దేశ్యాప్తంగా చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను ఇందులో భాగస్వాములను చేయాలని, ఈ పత్రాలన్నీ ప్రజలకు అందుబాటులో పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని అంటున్నారు. ఆదివాసీ జాక్ చైర్మన్ యుసిసి పట్ల భయ సందేహాలు వ్యక్తం చేశారు. శతాబ్దాలుగా ఆదివాసి ప్రజలు పాటిస్తున్న కట్టుబాట్లు, ఆచారాలను యుసిసి దెబ్బతీస్తుందని అన్నారు. గిరిజన మహిళలకు భర్తను వదిలేస్తే ఆ తర్వాత పునర్వివాహానికి ఆదివాసీ కట్టుబాట్లలో ఎలాంటి అడ్డంకులు ఉండవని, దాంతో పాటు మహిళలకు తెగల కట్టుబాట్లలో అనేక హక్కులు లభిస్తాయని అంటున్నారు. ముస్లిం నగారా, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ ఖాన్ మాట్లాడుతూ యుసిసి దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీస్తుందని వ్యతిరేకించారు. మరోవైపు షరియా కమిటీ ఫర్ విమెన్, నేషనల్ ఫెడరేషన్ ఆప్ గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ సంస్థలు లా కమీషన్‌కు తమ అభిప్రాయాన్ని పంపించాయి. షరియా కమిటీ ఫర్ విమెన్ యూనిఫాం సివిల్ కోడ్‌ను తీవ్రంగా వ్యతిరేకించింది. గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ప్రతిస్పందనంలో యూనిపాం సివిల్ కోడ్ ఏమిటో తెలియని స్థితి ఉందని, లా కమీషన్ కోరిన అభిప్రాయాలు సాధారణ విషయాలకు సంబంధించినవని, లా కమీషన్ కానీ, ప్రభుత్వం కాని యుసిసి ప్రొవిజన్‌లు ఏమిటో చెప్పనే లేదని పేర్కొంది.

## తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముస్లిం డిక్లరేషన్

లోక్ సభ ఎన్నికలు, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్న తరుణంలో తెలంగాణ ముస్లిం ఆర్గనైజేన్స్ జాక్ ఒక ముస్లిం డిక్లరేషన్ విడుదల చేసింది. ఇందులో మొత్తం 22 డిమాండ్లున్నాయి. ముస్లిం ఓట్లు కోరుతున్న పార్టీలు ఈ డిమాండ్లపై హామీలివ్వాలని కోరారు. జూన్ 25న జరిగిన ముస్లిం మేధావుల సమావేశంలో ఈ డిక్లరేషన్ రూపొందించారు. ప్రొ. హరగోపాల్, సియాసత్ దినపత్రిక ఎడిటర్ జహీరుద్దీన్ ఖాన్ లు ఈ డిక్లరేషన్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. జాక్ కో కన్వీనర్ షేక్ యూసుఫ్ బాబా ఈ సమావేశాన్ని నిర్వహించారు. ముస్లిం జాక్ కన్వీనర్ సలీం బాషా ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ అన్సారీ, జాక్ కో ఆర్డినేటర్ ముహమ్మద్ యూనుస్, మేవా అధ్యక్షుడు షేక్ ఫారూక్ హుస్సేన్, డా. రియాజ్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణాలో ముస్లిం జనాభా 13 శాతం ఉన్నప్పటికీ, 40 నియోజకవర్గాల్లో నిర్ణాయక స్థాయిలో ఉన్నప్పటికీ వారిని కేవలం ఓటు బ్యాంకులుగా రాజకీయపార్టీలు వాడుకుంటున్నాయని, సచర్ కమిటీ, రంగనాథ మిశ్రా కమీషన్, సుధీర్ కమీషన్, తెలంగాణ బీసీ కమీషన్ లు కూడా ముస్లిముల దీనావస్థను బయటపెట్టాయని ఈ సమావేశంలో వక్తలు అన్నారు. ముస్లిములకు కనీసం 10 ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని, వెనుకబడిన ముస్లిం సముదాయాలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రతి సంవత్సరం బడ్జెటులో మైనారిటీ సంక్షేమానికి కనీసం పదివేల కోట్ల కేటాయింపులు ఇవ్వాలని, వక్ఫ్ బోర్డును కమీషనరేటుగా స్థాపించి జుడిషియల్ అధికారాలు ఇవ్వాలని, మైనారిటీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, ఉర్దూ భాషకు తగిన ప్రోత్సాహం ప్రాధాన్యత ఇవ్వాలని, ముస్లిం సాధికారత పథకం క్రింద ప్రతి పేద ముస్లిం కుటుంబానికి పదిలక్షల ఆర్థిక సహాయం అందించాలని, డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపులో 12 శాతం కోటా ఇవ్వాలని, నామినేటెడ్ పదవుల్లో ముస్లిములకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వలని, మైనారిటీ డిపార్టుమెంటులో ఖాళీలను పూరించాలని తదితర డిమాండ్లతో డిక్లరేషన్ విడుదల చేశారు. ఈ సంవత్సరం చివరికి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగవలసి ఉంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆరెస్ గా మారిన టీఆరెస్ ముచ్చటగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భావిస్తున్న నేపథ్యంలో ముస్లిం డిక్లరేషన్ రాజకీయాలను ఏ మలుపు తిప్పుతుందో వేచి చూడాలి.

# ఫేక్ న్యూస్ రౌండప్




**ఫేక్ వార్తలు** వడ్డించే ఫాక్టరీ ఎప్పటి మాదిరిగానే ఈ వారం కూడా అనేక ఫేక్ వార్తలను ప్రచారంలో పెట్టింది. అందులో కొన్ని చూద్దాం. ఒక ఫేక్ వార్త ప్రకారం కర్రలు లాఠీలు పట్టుకున్న ఒక గుంపు మిలిటరీ వాహనాన్ని అడ్డుకున్న వీడియో ఒకటి ప్రచారంలోకి వచ్చింది. ఈ మిలిటరీ వాహనంతో పాటు మరో అంబులెన్సు కూడా వెనుక ఉంది. ఈ రెండు వాహనాలను ఆ గుంపు అడ్డుకుని ఆపేసింది. గాయపడిన సైనికుడిని ఆసుపత్రికి తీసుకెళుతున్న సైనిక వాహనాన్ని, అంబులెన్సును ముస్లిములు అడ్డుకుని సైనికుడిని ఆసుపత్రికి వెళ్ళకుండా చేశారన్న ప్రచారం ఈ వీడియోతో పాటు మొదలయ్యింది. ఒక ఫేస్‌బుక్ ఫేకు వీరుడు ఈ సంఘటన పశ్చిమబెంగాల్లో జరిగిందని రాశాడు. ఈ దాడి చేసింది హజ్రతె ఇస్లాం అనే బంగ్లాదేశ్ సంస్థ అని కూడా ప్రచారం చేశారు. న్యూస్ చెకర్ వార్తా సంస్థ నిజనిర్ధారణలో తేలిందేమిటంటే, ఈ వీడియోలో వినిపిస్తున్న భాష బెంగాలీయే. ఆ వీడియోలో ఉన్న ముందరి వాహనంపై లైసన్సు ప్లేటుపై బెంగాలీ నెంబర్లున్నాయి. కాని గమనించవలసిన విషయమేమిటంటే, సాధారణంగా భారత సైనిక వాహనాల నెంబర్ ప్లేటులపై ఇంగ్లీషులో నెంబర్లుంటాయి. పైగా ఆ సైనికుల యూనిఫారంపై AMC అనే అక్షరాలున్నాయి. మరింత పరిశోధనలో తెలిసిందేమిటంటే, AMC అంటే బంగ్లాదేశీ ఆర్మీ మెడికల్ కార్ప్స్. యూనిఫారాలపై ఉన్న లోగో బంగ్లాదేశ్ సైన్యానికి సంబంధించింది. బంగ్లాదేశ్‌లో 2021లో పోలీసులకు, అక్కడి హిఫాజతె ఇస్లాం అనే సంస్థ కార్యకర్తలకు మధ్య చిట్టగాంగ్ వద్ద ఘర్షణలు జరిగాయి. ఘర్షణలకు కారణం మోడీ వ్యతిరేక ప్రదర్శనలకు అక్కడి బంగ్లాదేశ్ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. మార్చి 2021లో భారత ప్రధాని మోడీ బంగ్లాదేశ్ సందర్శించారు. అప్పుడు జరిగిన నిరసన ప్రదర్శనలివి. క్లుప్తంగా తెలిసిందేమిటంటే, ఈ వీడియోకు భారత సైన్యానికి సంబంధమే లేదు. ఈ సంఘటన జరిగింది. బంగ్లాదేశ్‌లో. అక్కడ జరిగిన సంఘటన వీడియోను తీసుకొచ్చి ఇక్కడ మతవిద్వేషాలు ప్రచారం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు.

మరో ఫేక్ వార్త చూద్దాం. ఒక వీడియోలో రక్తసిక్తమైన ఒక అమ్మాయి మృతదేహం రోడ్డుపై పడి ఉంది. ఈ వీడియో గురుగ్రామ్ సంఘటన అనీ, ఒక ముస్లిం గురుగ్రామ్‌లో ఒక హిందు అమ్మాయిని పొడిచి చంపేశాడని ప్రచారం ప్రారంభించారు. జులై 10వ తేదీన అంజలీటి అనే ట్విటరు ఖాతా నుంచి ఈ వీడియో షేర్ కావడం మొదలయ్యింది. ఒక ముస్లిం ఒక హిందూ అమ్మాయిని పొడిచి చంపితే సెక్యులర్ హిందువులు వీడియోలు తీసుకుంటున్నారంటూ రాశారు. జిహాద్ వైరస్ కరోనా వైరస్ కంటే ప్రమాదకరమైనదని కూడా రాశారు. హిందూ జాగృతి సమితి ప్రతినిధిగా ట్విటరు ఖాతా ఉన్న మోహన్ గౌడ్ అనే వ్యక్తి కూడా ఇది షేర్ చేశాడు. పెళ్ళి నిరాకరించిందని ఒక ముస్లిం ఒక హిందూ అమ్మాయిని చంపేశాడని రాశారు. ఇంకా చాలా మంది ఇది షేర్ చేశారు. ఆల్ట్ న్యూస్ నిజనిర్ధారణలో తెలిసిందేమిటంటే, గురుగ్రామ్‌లోని ముల్లాహేరా ప్రాంతంలో నేహా అనే 19 సంవత్సారాల అమ్మాయిని జులై 10వ తేదీన రామ్‌కుమార్ అనే వ్యక్తి పొడిచి చంపాడు. ఈ మొత్తం సంఘటన

సిసి టీవీల్లో రికార్డయ్యింది. ఆ అమ్మాయి తల్లి మాత్రమే నేరస్తుడిని ఎదిరించింది. మిగిలిన జనం అంతా తమాషా చూశారు. రామ్ కుమార్‌ను తర్వాత పోలీసులు అరెస్టు చేశారు. ఎన్డీటీవీ కథనం ప్రకారం ఈ ఇద్దరికి నాలుగు నెలల క్రితం నిశ్చితార్థం కూడా జరిగింది. కాని తర్వాత అమ్మాయి ఈ పెళ్లికి ఒప్పుకోలేదు.. మీడియా కథనాల్లో నిందితుడి పేరు రాజ్ కుమార్ అని వచ్చింది. పోలీసులు అతడి పేరు రామ్ కుమార్ అని చెప్పారు. కాబట్టి ఇది లవ్ జిహాదు కాదు, చంపినవాడు ముస్లిము కూడా కాదు. కాని ఈ సంఘటనను మతతత్వవిషాన్ని పంచడానికి విద్వేష శక్తులు ముస్లిం చేసిన నేరంగా ప్రచారం ప్రారంభించాయి. వాట్సప్ యూనివర్శిటీలో ఇలాంటి వార్తలు చదివేవారు ముస్లిములపై ద్వేషం పెంచుకుంటున్నారు.

ఇంకో ఫేక్ వార్త చూద్దాం. ఒక ప్రయివేటు కంపెనీ సియీవో వినుకుమార్ హత్య కర్నాటకలో జరిగింది. ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఫణీంద్ర సుబ్రహ్మణ్యం కూడా హత్యకు గురయ్యాడు. ఈ ఇద్దరినీ వారి కంపెనీలో పనిచేసే ఒక మాజీ ఉద్యోగి జూన్ 11న హతమార్చినట్లు తెలియవచ్చింది. ఈ హత్య జరిగిన వెంటనే సుబ్రహ్మణ్యం ఫోటోను వైరల్ చేస్తూ అతను హిందూ సాధువని ప్రచారం చేస్తూ దీనికి మతం రంగు పులిమే ప్రయత్నాలు చేశారు. బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవధర్, ట్విటరు యూజర్ అరుణ్ పుదురు తదితరులు ఈ ప్రచారం ప్రారంభించారు. క్వింట్ వార్తాసంస్థ నిజనిర్ధారణ ప్రకారం సుబ్రహ్మణ్యం ఒక పూజా కార్యక్రమంలో ఉన్నప్పటి చిత్రం అది. బెంగుళూరు పోలీసుల ప్రకారం ఈ సంఘటన వెనుక మతం కోణం ఏదీ లేదు. నిందితులు, బాధితులు అందరూ ఒకే మతానికి చెందినవారు. వ్యాపార పరమైన వైరం వల్ల జరిగిన హత్యలివి. ఈ సంఘటనను మత విద్వేషం రెచ్చగొట్టడానికి జాతీయ పార్టీలో పెద్ద పదవుల్లో ఉన్నవారు కూడా వాడుకోవడం నేడు దేశంలో ఎలాంటి అబద్ధాల వాతావరణం అలముకుందో తెలియజేస్తోంది.

మరో ఫేక్ వార్త చూద్దాం. ఒక వీడియోలో కొందరు గుంపుగా ఒక వ్యక్తిని చావబాదుతున్న దృశ్యాలున్నాయి. ఈ సంఘటన రాజస్థాన్‌లో జరిగిందని, హిందూ దుకాణదారుడిపై ముస్లిములు చేస్తున్న దౌర్జన్యమని ప్రచారం మొదటు పెట్టారు. ఒక కిరాణా కొట్టులో యజమానిని కొందరు కొడుతున్న వీడియో ఇది. హిందువు అయినందుకు జిహాదీలు ఒక దుకాణదారుడిపై దాడి చేశారని, జోధ్‌పూర్‌లో గెహ్లాత్ ప్రభుత్వం ఇంటర్నెట్ కట్ చేసిందని, ఈ వీడియోను అందరికీ షేర్ చేయాలని ప్రచారంలో పెట్టారు. బూమ్ వార్తా సంస్థ ఈ వీడియో వాస్తవాలు బయటపెట్టింది. ఈ వీడియో మే 2022 నాటిది. జోధ్‌పూర్ వీడియో కాదు. మే 2022లో కూడా ఈ వీడియో మతవిద్వేషాలు రెచ్చగొట్టడానికి ఉపయోగించినప్పుడు కూడా బూమ్ వార్తా సంస్థ ఈ వివరాలు బయటపెట్టినట్లు రాసింది. అప్పట్లో ఈ వీడియో బంగ్లాదేశ్ వీడియో అని, ఒక హిందూ కార్యకర్తను అక్కడి ఇఫ్తార్ పార్టీ సభ్యులు చావగొడుతున్నారని ఫేక్ వార్త ప్రచారం చేశారు. ఇప్పుడు అదే వీడియోను వాడుకుని హిందూ దుకాణదారుడిని ముస్లిములు కొడుతున్నారని ప్రచారం మొదలు పెట్టారు. బూమ్ వార్తా సంస్థ ప్రకారం ఈ వీడియో హర్యానాకు చెందినది. హిందీ దినపత్రిక అమర్ ఉజాలాలో అప్పట్లో ఈ సంఘటన గురించిన వార్త కూడా వచ్చింది. కమల్ జిత్ అనే దుకాణదారుడిని డబ్బు విషయమై వివాదంలో కొందరు కొట్టారు. ఈ సంఘటనలో నిందితుల పేర్లు ఒకడి పేరు రికీ, మరొకడి పేరు ఇషాక్. ఈ ఘర్షణకు కారణం డబ్బుకు సంబంధించిన వ్యవహారమని, ఇందులో మతకోణం ఏదీ లేదని పోలీసులు నిర్ధారించారు. ఫేక్ వార్తలను ప్రచారం చేయడంలో ఇప్పుడు అందరూ ఉత్సాహం చూపిస్తున్నారు.

కాషాయం ధరించిన శివభక్తులు కన్వారియాలు ఒక బ్లూ కలర్ కారుపై కూర్చున్న వ్యక్తితో వాగ్వివాదానికి దిగిన సంఘటన ఒక వీడియోగా ప్రచారంలోకి వచ్చింది. కారులో కూర్చున్న బురఖా మహిళ కారు నుంచి కిందికి దిగింది. కన్వారియాలు ఆగ్రహంతో కారును తలకిందులు చేశారు. బూమ్ వార్తా సంస్థ నిజనిర్ధారణలో తెలిసిందే మిటంటే, ఆ కారు డ్రయివరు హిందువే. అతని పేరు ప్రతాప్ సింగ్. కారులో ఉన్న మహిళ అతని భార్య కాదు. అతనికి పరిచయం ఉన్న వ్యక్తి మాత్రమే. హరిద్వార్ వద్ద గుడ్ మండి వద్ద ప్రతాప్ సింగ్ తన కారును పార్కు చేశాడు. అక్కడ కన్వారియా యాత్రికులు కూడా ఉన్నారు. ప్రతాప్ సింగ్ తో పాటు కారులో అతనికి పరిచయస్తురాలైన ఒక ముస్లిం మహిళ కూడా కారులో ఉంది. ప్రతాప్ సింగ్ కారును బయటకు తీస్తున్నప్పుడు పొరబాటున ఒక కన్వారియాకు తగిలింది. దాంతో ఘర్షణ జరిగింది. కన్వారియాలు ఆ కారుపై దాడి చేశారు. కారులో బురఖా మహిళ ఉండడంతో ముస్లిం దంపతులని భావించి దాడి చేసినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఇప్పుడు దేశంలో ఫేక్ వార్తలు జోరుగా ప్రచారం అవుతున్నాయి.

ఇంతకు ముందు మనం పాకిస్తాన్‌లో తండ్రిని వివాహం చేసుకున్న కుమార్తె అన్న ఫేక్ వార్త గురించి మాట్లాడుకున్నాం.

ఈ ఫేక్ వార్తను వాస్తవాలు ఏమిటో కాస్తయినా పరిశోధించ కుండానే మన తెలుగు మీడియాలో కూడా ప్రచారం చేశారు. మన మీడియా పరిస్థితి ఇది.

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**53 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 42. అష్ షూరా

8 అల్లాహ్ కోరుకున్నట్లయితే వీరినందరినీ ఒకే సముదాయంగా చేసివేసేవాడు, కాని ఆయన తాను కోరిన వారిని తన కారుణ్యంలో ప్రవేశింపజేస్తాడు. దుర్మార్గులకు ఏ ఒక్కడూ అండగా నిలువడూ సహాయమూ చేయడు.[11] వీరేమిటీ (అవివేకులా) ఆయన్ని కాదని ఇతరుల్ని సంరక్షకులుగా చేసుకున్నారు? సంరక్షకుడయితే అల్లాహ్ ఒక్కడే, ఆయనే మృతులను బ్రతికిస్తాడు, ఆయన ప్రతిదానిపైనా అధికారం గలవాడు. 12

**(11వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

మూడవది, దీని ఉద్దేశం విశ్వసించేవారికి, ధర్మ ప్రచారంలోనూ, మానవ సంస్కరణలోనూ తరచుగా ఎదురయ్యే ఇబ్బందుల వాస్తవికతను బోధపరచడం. అల్లాహ్ ప్రసాదించిన ఎన్నుకునే, అవలంబించే స్వేచ్ఛ కారణంగా స్వభావాల్లోనూ విధానాల్లోనూ ఏర్పడే విభేదాలను అర్థం చేసుకోని వారు సంస్కరణా కార్యం ఎంతో మెల్లమెల్లగా ముందుకు సాగడాన్ని చూసి ఒక్కోసారి నిరాశ చెందుతారు అల్లాహ్ పక్షాన ఏవయినా అద్భుతాలు, మహిమలూ వ్యక్తమయి ప్రజలు వాటిని చూసి మనసు మార్చుకోవాలని కోరుకుంటారు. మరొకసారి వారు అవసరాన్ని మించి ఉద్రేకం చూపి సంస్కరణ కొరకు అనుచితమయిన విధానాలు అవలంబించడానికి ఉద్యుక్తులవుతారు. (ఈ ఉద్దేశంతోనూ దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ విషయాన్ని కొన్ని చోట్ల సెలవీయడం జరిగింది. ఖుర్‌ఆన్ అవగాహనం, సం.4, అర్ రాద్: పాద సూచికలు 47-49 అన్ నహ్ల్ : ఆయత్‌లు 90-93).

ఈ ఉద్దేశాలతో ఒక ముఖ్యమయిన విషయం ఈ క్లుప్తమయిన పదాలలో వ్యక్తీకరించడం జరిగింది. ప్రపంచంలో దేవుని నిజమయిన ప్రాతినిధ్యం పరలోకంలో ఆయన స్వర్గం ఏదో సాధారణ కారుణ్యం కాదు, మట్టి, రాయి, గాడిదలు, గుర్రాల స్థాయి మనుషులకు సర్వసాధారణ కారుణ్యంలా పంచి పెట్టడానికి. ఇది ఒక ప్రత్యేకమయిన కారుణ్యం, ఎంతో ఉన్నతస్థాయి కారుణ్యం. దీనికి దైవదూతలు సయితం తగిన వారు కారని భావించడం జరిగింది. అందువల్లనే మానవుణ్ణి ఒక సాధికార సృష్టిగా పుట్టించి అల్లాహ్ తన భూమిలోని ఈ సువిశాల సాధనా సంపత్తిని అతని అధీనంలో ఇచ్చి వేశాడు. ఈ హంగామా సృష్టించే శక్తులు అతనికి ప్రదానం చేశాడు. తద్వారా అతను ఈ పరీక్షలో పాల్గొని అందులో ఉత్తీర్ణుడయినప్పుడే దాసుడు ఆయన ప్రత్యేక కారుణ్యానికి నోచుకునే అర్హత పొందగలడు. ఈ కారుణ్యం అల్లాహ్‌కు ప్రత్యేకం. దానిపైన ఎవరికీ అధికారం లేదు, ఎవరూ తమ వ్యక్తిగత అర్హత కారణంగా పొందనూ లేరు. ఇంకా ఎవరూ దాన్ని బలవంతాన పొందే శక్తీ కలిగి లేదు. దీన్ని పొంద గలవాడు అల్లాహ్ సన్నిధిలో తన దాస్యాన్ని సమర్పించుకున్నవాడే, ఆయన్ని తన సంరక్షకుడుగా చేసుకున్నవాడే, ఆయన శరణు పొందినవాడే. అప్పుడే అల్లాహ్ అతనికి సహాయం చేస్తాడు, దారి చూపుతాడు, అతను ఈ పరీక్షను సునాయాసంగా దాటగలిగే సద్బుద్ధిని ప్రసాదిస్తాడు, అలా అతను ఆయన కారుణ్యంలో ప్రవేశించగలుగుతాడు. కాని ఏ దుర్మార్గుడయితే ఆయనకు విముఖుడవుతాడో, ఆయన్ని కాదని ఇతరుల్ని తన సంరక్షకులుగా చేసుకుంటాడో, బలవంతాన అటువంటి వారి సంరక్షకుడయ్యే అగత్యం అల్లాహ్‌కు ఏదీ లేదు. మరి అతను ఎవరినయితే తన సంరక్ష కుడుగా చేసుకుంటాడో వారికి అసలు ఎటువంటి జ్ఞానమూ, శక్తి, ఎటువంటి అధికారాలు లేనేలేవు, వారు అతని సంరక్షణా విధుల్ని నెరవేర్చి అతన్ని గెలిపింపజెయ్యడానికి.

12. అంటే, (విలాయత్) 'సంరక్షణ' అన్నది ఏదో మనసుకు నచ్చిన అంశం కాదు, మీరు కోరుకున్న వారిని సంరక్షకులుగా చేసుకోగా అతను వాస్తవంగానే మీకు నిజమయిన అసలయిన సంరక్షకుడుగా రూపొంది మీ సంరక్షణా బాధ్యతలు సక్ర మంగా నిర్వహించడానికి. ఇది ఒక వాస్తవికత. అది జనుల అభీష్టాల ఆధారంగా రూపొందుతూ చెరిగిపోతూ ఉండదు. నిజానికి ఎవరయితే వాస్తవంగా సంరక్షకుడో ఆయనే సంరక్షకుడు, మీరు ఆయన్ని సంరక్షకుడుగా భావించినా భావించకపోయినా, నమ్మక పోయినా. అలాగే వాస్తవంగా ఎవరు సంరక్షకుడు కాడో అతను సంరక్షకుడు కానేరడు. అతన్ని మీరు మరణించేవరకూ మీ సంరక్షకుడుగానే భావిస్తూ నమ్ముతూ ఉన్నా. పోతే, కేవలం అల్లాహ్ మాత్రమే నిజ మయిన సంరక్షకుడు అనడానికీ ఇతరులెవ్వరూ సంరక్షకులు కారనడానికి ఆధారం ఏమిటీ అన్న ప్రశ్న. సమాధానం ఏమిటంటే, మానవుని నిజ సంరక్షకుడు మృత్యువును జీవితంగా మలచగలిగినవాడే, జీవంలేని పదార్థంలో ప్రాణంపోసి సజీవమయిన సక్రమమయిన మానవుణ్ణిగా పుట్టించినవాడు, సంరక్షణా బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించగలిగే అధికారాలున్నవాడు. అలాంటివాడు అల్లాహ్ తప్ప మరొకరెవరయినా అయినట్లయితే వారినే సంరక్షకుడుగా చేసుకోండి. అలాకాక అటువంటి ఆయన కేవలం ఒక్క అల్లాహ్ మటుకే కాగలిగితే ఆయన్ని కాదని ఇతరుల్ని సంరక్షకులుగా చేసుకోవడం అజ్ఞానం, అవివేకం, ఆత్మహత్యా సదృశం తప్ప మరేమీ కాదు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ الْمَنَاقِبِ

## 2. మహిమోన్నతుల ప్రకరణం (కితాబుల్ మనాఖిబ్)

**162)** ఉర్వా బిన్ జుబైర్ కథనం: దైవప్రవక్త(స), అబూబక్ర్ (రజి)ల తర్వాత అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) పట్ల హజ్రత్ ఆయిషా (ర.అ) గారికి ఎక్కువ ప్రేమాదరణలు ఉండేవి. అమ్మ ఆయిషా(ర.అ) గారి అలవాటు ఏమిటంటే; అల్లాహ్ నుండి తనకు ఏ ఉపాధి అందినా, దానిని దానం చేసేవారు. ఒకసారి అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) ఎవరితోనో, 'ఉమ్ముల్ మోమినీన్‌ని ఈ దానధర్మాల నుండి ఆపాలి' అని చెప్పారు. (హజ్రత్ ఆయిషా-ర.అ-గారికి ఈ సంగతి తెలిసినప్పుడు ఆమె ఇలా అన్నారు:) 'ఏమిటి, ఇప్పుడు నా చేతులను కట్టిపడేస్తారా? ఇక నుంచి నేను అబ్దుల్లాహ్‌తో మాట్లాడితే ఒట్టు. అతనితో మాట్లాడినట్లయితే నాపై పరిహారం (కఫ్ఫారా) తప్పనిసరి అయినట్లే.' అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) హజ్రత్ ఆయిషా (ర.అ) కోపాన్ని చల్లార్చడానికి ఖురైష్ తెగకు చెందిన కొంతమందిని, ముఖ్యంగా దైవప్రవక్త(స) తల్లి తరపు బంధువులను (బనూ జుహ్రాను) ఆమె వద్దకు పంపి క్షమాభిక్ష పెట్టమని సిఫారసు చేయించారు. కాని ఆయిషా(ర.అ) అంగీకరించలేదు. అప్పుడు బనూ జుహ్రాకు చెందిన వ్యక్తులు- వారు దైవప్రవక్త మేనమామలు- వారిలో అబ్దుల్లాహ్ బిన్ అస్వద్ బిన్ అబ్దె యగూస్, మిస్వర్ బిన్ మఖ్రమా కూడా ఉన్నారు- అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)కు సలహా ఇస్తూ వారిలా అన్నారు: 'చూడు, మేము ఆమె గారి అనుమతితో అక్కడికి వెళ్ళి కూర్చున్నప్పుడు, నీవు ఒక్కసారిగా వచ్చి తెరలోపలికి దూరిపో'. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) అలాగే చేశారు. (ఇది గమనించిన హజ్రత్ ఆయిషా-ర.అ- లోలోపలే సంతోషించారు). పిదప అబ్దుల్లాహ్ ఆమె గారి సేవలో పదిమంది బానిసలను పంపగా, వారందరికీ విశ్వాసుల మాత (ప్రమాణ భంగానికి పరిహారంగా) స్వేచ్ఛను ప్రసాదించారు. ఆ తరువాత కూడా ఆమె అప్పుడప్పుడూ బానిసలకు విమోచనం ప్రసాదిస్తూ ఉండేవారు. ఈ విధంగా ఆమె విడుదల చేసిన బానిసల సంఖ్య నలభైకి చేరుకుంది. తరువాత ఆమె ఇలా అన్నారు: 'అయ్యో! నేను ఒట్టేసుకున్నప్పుడే (అంటే మొక్కుకున్నప్పుడే) ప్రమాణ భంగానికి పరిహారంగా ఈ పని చేస్తానని స్పష్టంగా చెప్పి ఉన్నట్లయితే, అది చేసేసి ఉండేదాన్ని (ఇంతటి సందిగ్ధానికి లోనయ్యేదానిని కాను)' అన్నారు.[1]

### అధ్యాయం: 3 ఖురైషుల భాషలో ఖుర్‌ఆన్ అవతరించటం

**163)** హజ్రత్ అనస్ (రజి) కథనం: హజ్రత్ ఉస్మాన్(రజి) గారు జైద్ బిన్ సాబిత్, అబ్దుల్లాహ్ బిన్ జుబైర్, సయీద్ బిన్ ఆస్, అబ్దుర్రహ్మాన్ బిన్ హారిస్ బిన్ హిషామ్(రజిఅల్లాహు అన్‌హుమ్)లను పిలిచి, దివ్య ఖుర్‌ఆన్‌ను లిఖించే మహత్కార్యంపై నియమించారు. ఆ నలుగురు మహనీయులు దివ్య ఖుర్‌ఆన్ యొక్క అనేక ప్రతుల నకళ్ళను తయారు చేశారు. అప్పుడు హజ్రత్ ఉస్మాన్(ఆ నలుగురు సహాబాలో) ముగ్గురు ఖురైష్ సహాబాతో ఇలా అన్నారు: "చూడండి! దివ్య ఖుర్‌ఆన్‌లో ఎక్కడయినా, ఏ జాతీయంలోనయినా మీకు జైద్ బిన్ సాబిత్(రజి)తో భేదాభిప్రాయం ఏర్పడితే, మీరు ఖురైషుల జాతీయం ప్రకారం దానిని లిఖించండి (ఎందుకంటే జైద్ బిన్ సాబిత్ మదీనా వాసులు). ఎందుకంటే దివ్య ఖుర్‌ఆన్ ఖురైషుల జాతీయంలో అవతరించింది."[1]- వారు అలాగే చేశారు.

162-1. అంటే- ఒక బానిసను విడుదల చేస్తాననో లేదా ఇంతమంది నిరుపేదలకు అన్నం పెడతాననో అని ఉంటే ఆంతర్యంలో సంశయం ఉండేది కాదు. హజ్రత్ ఆయిషా(ర.అ) అస్పష్టంగా మొక్కుకున్నారు. అందుకే ముందుజాగ్రత్తగా నలభై మంది బానిసలను విడుదల చేయాల్సి వచ్చింది.

ఇకపోతే అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) ఎవరో కాదు, ఆయిషా గారి అక్క అయిన అస్మా బిన్తె అబూబక్ర్(ర.అ) కుమారుడే. ఆయిషా(ర.అ) ఆయనకు పినతల్లి. బాల్యం నుండి పిన తల్లి పర్యవేక్షణలోనే ఆయనకు చదువు సంస్కారం అబ్బింది.

163-1. అసలేం జరిగిందంటే, దివ్య ఖుర్‌ఆన్ హజ్రత్ అబూబక్ర్(రజి) ఖిలాఫత్ కాలం లోనే సేకరించబడింది. అదే ప్రతి హజ్రత్ ఉమర్(రజి) పరిపాలనా కాలంలో కూడా ఆయన వద్ద ఉండేది. హజ్రత్ ఉమర్(రజి) మరణానంతరం ఆ ప్రతి ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ హఫ్సా (ర.అ) దగ్గర భద్రపరచబడింది. హజ్రత్ ఉస్మాన్(రజి) ఆ ప్రతిని తన హయాంలో హఫ్సా (ర.అ) దగ్గరి నుండి తెప్పించి, పై నలుగురు మహనీయుల చేత దాని నకళ్ళను తయారు చేయించారు. ఒక్కో నకలు ప్రతిని ఇరాక్, సిరియా, ఈజిప్టు, ఈరాన్ తదితర ప్రదేశాలకు పంపించారు. అందుకే హజ్రత్ ఉస్మాన్(రజి)ను 'జామెవుల్ ఖుర్‌ఆన్' అంటారు. ఆయన గారు ఖుర్‌ఆన్ నకళ్ళను స్పష్టంగా వ్రాయించి ఇరుగు పొరుగు రాజ్యాలకు పంపించారు. అంతేగాని ఖుర్‌ఆన్ ఆయన హయాంలోనే సేకరించ బడిందనేది సరైనది కాదు. దైవప్రవక్త(స) కాలంలోనే ఖుర్‌ఆన్ కూర్చ బడింది. విడిగా ఉన్న మరి కొంతభాగం అబూబక్ర్(రజి) పరిపాలనా కాలంలో సమీకరించబడింది.

# గర్వ భంగం -2

– ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

## హదీసుల వెలుగులో గర్వాహంకారం

ప్రవక్త మహోదయులు ముహమ్మద్(సఅసమ్) ప్రవచించినట్లుగా హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు : “మనసులో రవ్వంత గర్వం ఉన్న వ్యక్తి స్వర్గంలో ప్రవేశించలేడు.” ‘దైవప్రవక్తా! ఒక వ్యక్తి తన దుస్తులు, చెప్పులు చూడచక్కగా, అందంగా ఉండాలని కోరుకుంటాడు కదా! మరి ఇది కూడా గర్వం క్రిందికే వస్తుందా?’ అని ఒక వ్యక్తి సందేహపడగా,

“నిశ్చయంగా అల్లాహ్ సుందర స్వరూపుడు. ఆయన సౌందర్యాన్ని ఇష్టపడతాడు. ఇక గర్వం అంటారా, సత్యాన్ని ధిక్కరించటం, సాటి జనులను అల్పులుగా భావించటం గర్వాతిశయం (కిబ్ర్). అని ఆయన (స) వివరించారు. (సహీహ్ ముస్లిం)

అలాగే మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు:

“దైవప్రవక్త మహనీయ నూహ్(అలైహిస్సలామ్)కు మరణ ఘడియలు ఆసన్నమైనప్పుడు, ఆయన తన కుమారునికి వసీయతు చేస్తూ ఇలా అన్నారు :

“(ఒరేయ్ అబ్బాయి!) నేను నిన్ను రెండు విషయాలకు కట్టుబడి ఉండాల్సిందిగా, మరో రెండు విషయాలను విడనాడవలసినదిగా ఆదేశిస్తున్నాను...

నీవు **‘లా ఇలాహ ఇల్లల్లాహ్’**ను పఠించవలసినదిగా ఆజ్ఞాపిస్తున్నాను. ఎందుకంటే సప్తాకాశాలు, సప్త భూమండలాలను తెచ్చి ఒక త్రాసు పళ్ళెంలో ఉంచి, మరో పళ్ళెంలో **లా ఇలాహ ఇల్లల్లాహ్** ను ఉంచినట్లయితే, **లా ఇలాహ ఇల్లల్లాహ్** ఉంచబడిన త్రాసు పళ్ళెం బరువుగా ఉంటుంది. ఒకవేళ ఏడు భూమ్యాకాశాలు గనక ఏదయినా ఒక నిర్బంధ పరిధిలో ఉంటే, లా ఇలాహ ఇల్లల్లాహ్ వాటిని ధ్వంసం చేసేస్తుంది.”

“ఇంకా నీవు **‘సుబ్హానల్లాహి వ బిహమ్దిహీ’**ని పఠిస్తూ ఉండ వలసినదిగా ఆదేశిస్తున్నాను. ఎందుకంటే ఇది అన్ని రకాల వస్తువులను అర్థించే వేడుకోలు. ప్రాణులకు దీని మూలంగానే ఉపాధి వొసగబడుతుంది.”

“నేను నిన్ను షిర్క్ నుండి, తకబ్బుర్ (గర్వాహంకారం) నుండి వారిస్తున్నాను.”

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా అంటున్నారు- నేనడిగాను లేదా మరో సహచరుడు అడిగారు- (దైవప్రవక్తా!) షిర్క్ అంటే ఏమిటో మాకు తెలుసు. కాని కిబ్ర్(గర్వం) అంటే ఏమిటి? అని.

సమాధానంగా ఆయన(స) ఇలా అన్నారు : “సత్యాన్ని ఎదిరించటం, తోటి జనులను అల్పులుగా పరిగణించటం కిబ్ర్ (గర్వం).

ఈ రెండు హదీసుల ద్వారా అవగతమయ్యేదేమంటే, రెండు వస్తువులకు మరో పేరే గర్వం (ముస్నద్ అహ్మద్) 1) సత్యాన్ని ఎదిరించటం 2) జనులను అల్పులుగా భావించటం.

**1) సత్యాన్ని ఎదిరించటం :** అంటే ఎప్పుడయినా, ఎవరికయినా ఖుర్ఆన్ సున్నతుల వెలుగులో సత్యబద్ధమైన విషయాన్ని

వినిపించినప్పుడు లేదా సత్యం తెలిసి వచ్చినప్పుడు దానిని వ్యతిరేకించటం, దానిని పాటించేందుకు నిరాకరించటం 'సత్యాన్ని ఎదిరించటం'గా భావించబడుతుంది.

ఇక సత్యం అంటే ఏది? అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)పై అవతరించిన విషయం- అంటే ఖుర్ఆన్ మరియు సున్నత్.

"మరెవరయితే విశ్వసించి, సత్కార్యాలు చేశారో, ముహమ్మద్‌పై అవతరింపజేయబడిన దానిని కూడా విశ్వసించారో- యధార్థానికి తమ ప్రభువు తరపు నుండి వచ్చిన సందేశం అదేను- అల్లాహ్ వారి పాపాలను వారి నుండి దూరం చేస్తాడు. వారి పరిస్థితిని చక్కదిద్దుతాడు." (ముహమ్మద్-2)

కాబట్టి ముస్లిం అయిన ప్రతి వ్యక్తి 'సత్యం' ముందు- అంటే ఖుర్ఆన్, సున్నతుల ముందు- బేషరతుగా తలవంచాలి. ఆత్మ సమర్పణ చేసుకుని, దానిని పాటించాలి. దానిని నుండి పలాయన వాదం చిత్తగించకూడదు. ఉద్దేశపూర్వకంగా సత్యాన్ని ఎదిరించినవాడు, తన ఈ గర్వాతిశయం కారణంగా వ్యధాభరిత మైన శిక్షకు గురవుతాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"అతనికి మా వాక్యాలు వినిపించినప్పుడు, అతను వాటిని అసలు విననే లేదన్నట్లుగా, అతని చెవులలో చెవుడు ఉన్నట్లుగా అహంకారంతో తన ముఖాన్ని తిప్పుకుంటాడు. సరే మంచిది, అతి బాధాకరమైన ఒక శిక్ష ఉన్నది అనే శుభవార్తను అతనికి వినిపించు." (లుఖ్మాన్- 7)

వేరొకచోట ఇలా హెచ్చరించటం జరిగింది :

"ఇది నిశ్చయం! మా ఆయతులను తిరస్కరించినవారి కొరకూ, వాటి పట్ల తలబిరుసుతనం ప్రదర్శించినవారి కొరకూ ఆకాశ ద్వారాలు ఎంతమాత్రం తెరువబడవు. సూది రంధ్రం గుండా ఒంటె పోవటం ఎంత అసంభవమో, వారు స్వర్గంలోకి పోవటం కూడా అంతే అసంభవం. అపరాధు లకు మా వద్ద ఇటువంటి ప్రతిఫలమే లభిస్తుంది." (అల్ ఆరాఫ్ : 40)

**2) జనులను అల్పులుగా భావించటం** : అంటే తనను తాను ఇతరులకన్నా గొప్పవానిగా తలంచి, ఇతరులను అధములుగా పరిగణించటం. ఖచ్చితంగా ఇది కూడా గర్వాహంకారం క్రిందికే వస్తుంది. అందుకే అల్లాహ్ ఇతరులను పరిహసించి, వారిని చెడ్డ పేర్లతో పిలువటాన్ని ఖండించాడు. ఈ విధంగా సెలవీయ బడింది-

"విశ్వాసులారా! పురుషులు ఇతర పురుషులను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠులై ఉండవచ్చు. అలాగే స్త్రీలు ఇతర స్త్రీలను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠురాండ్రయి ఉండవచ్చు. ఒకరినొకరు ఎత్తి పొడుచుకోకండి. ఒకరినొకరు చెడ్డ పేర్లతో పిలుచుకోకండి." (అల్ హుజురాత్ : 11)

## గర్వాహంకారం పలు రకాలు

**1) నిక్కుతూ నడవడం** : నేలపై నిక్కుతూ నడవడం, బడాయిని, ఎచ్చును ప్రదర్శించటం గర్వాహంకారం అనిపించుకుంటుంది. దీనిని అల్లాహ్ నిషేధించాడు.

"ప్రజలతో ముఖం ప్రక్కకు తిప్పి మాట్లాడకు. భూమిపై నిక్కుతూ నడవకు. అహంభావి, బడాయికోరు అయిన ఏ వ్యక్తినీ అల్లాహ్ ప్రేమించడు. (లుఖ్మాన్: 18)

మహనీయ ముహమ్మద్(స) ఇలా ప్రవచించారు :

"ఒక వ్యక్తి రెండు వస్త్రాలు తొడిగి నిక్కుతూ, నీల్గుతూ నడవసాగాడు. స్వోత్కర్షకు లోనయ్యాడు. అంతలోనే అల్లాహ్ అతన్ని నేలలో దిగ్గొట్టాడు. అతడు ప్రళయదినం వరకూ నేలలో కూరుకుపోతూనే ఉంటాడు." (సహీహ్ ముస్లిం)

మరో హదీసులో ఇలా వుంది :

"ఎవరయితే తనను తాను గొప్పవానిగా ఊహించుకుని, భూమిలో విర్రవీగుతూ నడుస్తాడో అతను, అల్లాహ్ తన పట్ల అప్రసన్నుడై ఉన్న స్థితిలో ఆయన్ని కలుసుకుంటాడు."

అందుకే ముస్లిం అయిన వ్యక్తి గర్వంతో విర్రవీగకూడదు. అణకువను అలవరచుకోవాలి. భువిపై వినమ్రుడై నడవాలి.

"కరుణామయుని నిజమైన దాసులు నేలపై వినమ్రులై నడుస్తారు" (అల్ ఫుర్ఖాన్ : 63)

## స్వోత్కర్ష

తన సౌందర్యంపై, పర్సనాలిటీపై, ఆహార్యంపై, సిరిసంపదలపై, తెలివితేటలపై మిడిసిపడటం కూడా గర్వాతిశయం లోనికే వస్తుంది.

అలాగే తనను చూసి, జనులు తన గౌరవార్థం లేచి నిలబడాలని కోరుకోవటం కూడా గర్వంలో భాగమే.

అబూ ముజ్‌లిస్ ఇలా తెలిపారు : ఒకసారి ముఆవియా వచ్చినప్పుడు, ఆయన్ని చూసి అబ్దుల్లాహ్ బిన్ జుబైర్, ఇబ్నె సఫ్వాన్ లేచి నిలబడ్డారు. వెంటనే ముఆవియా ఇలా అన్నారు : "కూర్చోండి. ఎందుకంటే, నేను దైవప్రవక్త(స) ఈ విధంగా చెప్పగా విన్నాను- (దైవప్రవక్త-స- ఇలా చెప్పారు) : "జనులు తన గౌరవార్థం లేచి నిలబడటాన్ని ఇష్టపడేవాడు, తన నివాస స్థలం నరకం అని తెలుసుకోవాలి" (జామె తిర్మిజీ)

అందువల్లనే ప్రవక్త సహచరమాన్యులు దైవప్రవక్త(స)ను చూసి కూడా లేచి నిలబడే వారు కారు. ఎందుకంటే ప్రియ సహచరులు ఇలా నిలబడటం ఆయన(స)కు నచ్చేది కాదు.




**ఇస్లామీయ** క్యాలండర్ ప్రకారం సంవత్సరంలోని మొదటి నెల 'మొహర్రం'. ప్రతి సంవత్సరం ఈ నెల వస్తూనే ముహమ్మద్ ప్రవక్త(స) వారి జీవితంలోని ఓ ముఖ్యమైన ఘట్టం మనసులో మెదులుతుంది. అదే 'హిజ్రత్'. (మక్కా నుండి మదీనాకు వలస). హిజ్రత్ తరువాతనే ధర్మానికి జవసత్వాలు చేకూరాయి, ధర్మం ఎల్లెడలా విస్తరించింది. ధర్మ పరిరక్షణ, మానవ సేవ, మానవులకు సత్యసందేశాన్ని అందించడం లాంటి మహత్తర ఆశయం కోసం కష్ట నష్టాలను సహించాల్సి వచ్చినా, చివరికి స్వదేశాన్ని విడిచి వలస వెళ్ళవలసి వచ్చినా వెనకాడకూడదనే విషయాన్ని ముహర్రం ప్రతి సంవత్సరం విశ్వాసులకు గుర్తుచేస్తూ ఉంటుంది.

'మొహర్రం' ఒక ప్రత్యేక ప్రాముఖ్యత కలిగినటువంటి మాసం. ఇస్లామ్ ధర్మంలో దీనికొక ప్రత్యేకత ఉంది. ఇస్లామీ క్యాలండరు ప్రకారం ఇది ముస్లిమ్ జగత్తుకు నూతన సంవత్సరం. ముహర్రం మాసంతోనే ఇస్లామీయ నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. పూర్వచరిత్రలో కూడా దీనికి ప్రత్యేక ప్రాముఖ్యం ఉండింది. ఇస్లామ్‌కు పూర్వం అప్పటి సమాజంలో కూడా 'ముహర్రం' నుండే కొత్త సంవత్సరం ప్రారంభమయ్యేది. ముహమ్మద్ ప్రవక్త(స) ముహర్రం మాసాన్ని అల్లాహ్ నెల అని అభివర్ణించారు. రమజాన్ రోజాల (ఉపవాసాలు) తరువాత అత్యంత శుభప్రదమైన రోజా ఆషూరా రోజానే. అంటే ముహర్రం పదవ తేదీన పాటించబడే రోజా అన్నమాట. రమజాన్ రోజాలు విధిగా (ఫర్జ్‌గా) నిర్ణయించబడక పూర్వం ఆషూరా రోజాయే ఫర్జ్ రోజాగా ఉండేది. కాని రమజాన్ రోజాలు విధిగా నిర్ణయించబడిన తరువాత ఆషూరా రోజా నఫిల్‌గా మారిపోయింది.

ధర్మం ప్రకారం, 'దేవుడు భూమ్యాకాశాలను సృష్టించిన నాటి నుండి నెలల సంఖ్య ఆయన నిర్దేశించిన ప్రకారం పన్నెండు మాత్రమే. వాటిలో నాలుగు పవిత్ర మాసాలు'.(పవిత్ర ఖురాన్ 9 - 36) అందులో 'మొహర్రం' కూడా ఒకటి. ప్రవక్త(స) ప్రవచనం ప్రకారం : 'పన్నెండు నెలలు ఒక సంవత్సరం. అందులో నాలుగు నెలలు గౌరవప్రదమైనవి. జుల్ ఖఅద, జుల్ హిజ్జ, ముహర్రమ్, రజబ్. (మూడు వరుసగా, నాల్గవది మధ్యలో వస్తుంది) (సహీహ్ బుఖారీ 3197). కనుక ఈ నెలలో ఇతర నెలలకంటే ఎక్కువగా సత్కార్యాలు ఆచరిస్తూ పాపాలకు దూరంగా ఉండాలి. సమాజంలో సత్యం, న్యాయం, ధర్మం, మానవీయ విలువల పరిరక్షణకు కృషి చేయాలి. సమాజంలో ప్రబలిన అన్ని రకాల చెడులనురూపు మాపడానికి ప్రయత్నం చేయాలి. సతతం దైవ భీతి (తఖ్వా)తో గడపాలి. అప్పుడే దైవ సహాయం లభిస్తుంది. ఈ నెల ఘనతకు సంబంధించి ముహమ్మద్ ప్రవక్త(స) ఇలా అన్నారు. 'ముహర్రం అల్లాహ్ నెల. రమజాన్ ఉపవాసాల తరువాత శ్రేష్టమైన ఉపవాసాలు ముహర్రం ఉపవాసాలే.' (సహీహ్ ముస్లిం : 2755) రమజాను ఉపవాసాలు ఫర్జ్ కాక ముందు ఆషూర (ముహర్రం పదవ తేది) ఉపవాసం విధిగా ఉండేది. అదే రోజు కాబాపై క్రొత్త వస్త్రం కప్పబడేది. (సహీహ్ బుఖారీ 1592).

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) ప్రకారం, ఒకసారి ప్రవక్త

మహనీయులు మదీనాకు వెళ్ళారు. ఆరోజు అక్కడి యూదులు రోజా పాటిస్తున్నారు. అది ముహర్రం పదవ తేదీ. వారిని ప్రవక్త అడిగారు ' ఏమిటి ఈరోజు విశేషం? ' అని. దానికి వారు,' ఇది చాలా గొప్పరోజు. ఈ రోజే అల్లాహ్ మూసా ప్రవక్త(అ)ను, ఆయన జాతిని ఫిరౌన్ బారినుండి రక్షించాడు. ఫిరౌన్ ను, అతడి సైన్యాన్ని సముద్రంలో ముంచేశాడు. అప్పుడు మూసా ప్రవక్త, దైవానికి కృతజ్ఞతగా రోజా పాటించారు. కనుక మేముకూడా ఆయన అనుసరణలో ఈరోజు రోజా పాటిస్తాము'. అని చెప్పారు. అప్పుడు ప్రవక్త మహనీయులు, మూసా ప్రవక్త అనుసరణలో రోజా పాటించడానికి మీకంటే మేమే ఎక్కువ హక్కుదారులం. అని చెప్పి, అనుచరులకు రోజా పాటించమని ఉపదేశించారు.

ఆషూరా రోజా కేవలం యూదులే కాదు, క్రైస్తవులు కూడా పాటించే వారు. ఈ ఇరువర్గాలూ ముహర్రం పదవ తేదీన మాత్రమే రోజా పాటించేవి. కాని ప్రవక్తవారు, రెండు రోజులు పాటించమని తన సహచరులకు బోధించారు. అంటే ముహర్రం మాసం 9,10 కాని, లేక 10,11 కాని రెండురోజులు రోజా పాటించాలి.

కాకతాళీయంగా 'కర్బలా' సంఘటన కూడా ఇదే రోజున జరగడం వల్ల దీని ప్రాముఖ్యత మరింతగా పెరిగిపోయింది. అంత మాత్రాన ముహర్రం మాసమంతా విషాద దినాలుగా పరిగణించడం, ఎలాంటి శుభకార్యాలూ నిర్వహించక పోవడం సరికాదు. ఎందుకంటే సత్యం కోసం, న్యాయం కోసం, ధర్మం కోసం, హక్కుల కోసం, ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం హజ్రత్ ఇమామె హుసైన్(ర) అమరగతి పొందారు.

ముహమ్మద్ ప్రవక్త(స) స్వర్గస్తులైన తరువాత తొలి నలుగురు ఖలీఫాల సారధ్యంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ జనరంజకమైన ప్రజాస్వామ్య పాలన పరిఢవిల్లింది. ఇస్లామీయ ప్రజాస్వామ్యంలో మొట్ట మొదటి సూత్రం,'దేశం దైవానిది, దేశవాసులు ఆయన పాలితులు'. అంతేకాని పాలకులు ప్రజలకు ప్రభువులు ఎంతమాత్రం కాదు.

ఇస్లామీయ రాజ్యానికి దైవభీతి, సచ్ఛీలత, జవాబుదారీతనం ప్రాణం లాంటివి. పాలకులు ఈ సుగుణాలకు ప్రతిరూపంగా, ఆదర్శంగా ఉండేవారు. అధికారులు, న్యాయమూర్తులు, సేనాపతులు, అన్నిశాఖల అధికారులు ఎంతో నిజాయితీ పరులుగా, న్యాయ ప్రేమికులుగా ఉండేవారు. అనుక్షణం దైవానికి భయపడుతూ, ప్రజాసేవలో ఎలాంటి లోటు రాకుండా జాగ్రత్తపడేవారు. ప్రజలకు సమాధానం చెప్పుకునే విషయంలో కూడా వారు, 'ఎప్పుడైనా, ఎక్కడైనా తాము ప్రజలకు జవాబు దారుల'మని భావించేవారు. ప్రతిరోజూ నమాజుల సమయంలో ప్రజల్ని కలుసుకొని, వారి అవసరాలు తీర్చేవారు. అవసరమైన సూచనలు, హితవులు చేసేవారు. కాని తదనంతర కాలంలో పరిస్థితులు మారిపోయాయి. దైవభీతి, జవాబుదారీ తనం, ప్రజాస్వామ్య భావనలకు భంగం ఏర్పడింది. వారసత్వ పాలన రూపంలో పురుడు పోసుకున్న దుష్పరిణామాలు ఇస్లామీయ ప్రజాస్వామ్య భావనను, ఆ సూత్రాలను తుంగలో తొక్కాయి. ఈవిధంగా కుటుంబ పాలన, చక్రవర్తుల పరంపర ప్రారంభ మైంది. ఈ దురదృష్టకర పరిణామాల కారణంగా ముస్లిం సమాజం నేటి వరకూ ఇస్లామీయ ప్రజాస్వామ్య స్ఫూర్తికి దూరంగానే ఉండి పోయింది.

ఇలాంటి పరిస్థితుల్లో ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణకు హజ్రత్ ఇమామె హుసైన్ (ర) కంకణ బద్ధులయ్యారు. లక్ష్యసాధన కోసం ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోడానికి సిద్ధపడ్డారు. విలువల పరిరక్షణ కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడలేదు. ప్రజా కంటకమైన రాచరిక వ్యవస్థను ఎదుర్కొన్న క్రమంలో సంభవించిన పరిణామ ఫలితాలు ఈనాడు మనముందున్నాయి. ఇమామె హుసైన్ ఇంతటి ప్రమాదాన్ని కూడా లెక్కచేయకుండా వీరోచితంగా పోరాడి, ఇస్లామీయ ప్రజాస్వామ్య సంక్షేమరాజ్యాన్ని, దాని ప్రత్యేకతల్ని కాపాడుకోడానికి 'కర్బలా' సాక్షిగా ఒకవిశ్వాసి పోషించ వలసిన పాత్రను ఆచరణాత్మకంగా నిరూపించారు. అందుకే ఆ మహనీయుడు అమరుడై దాదాపు వేయిన్నర సంవత్సరాలు కావస్తున్నా, నేటికీ కోట్లాది మంది ప్రజలకు, ప్రజాస్వామ్య ప్రియులకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అందుకే ప్రతియేటా 'మొహర్రం' పదవ తేదీన (యౌమె ఆషూరా) ఆయన గారి త్యాగాన్ని స్మరించుకుంటారు.

ఈ నేపథ్యంలో చూసినప్పుడు హజ్రత్ ఇమామె హుసైన్ (ర) అమరత్వం ఆషామాషీ మరణం కాదు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, ధర్మసంస్థాపన, దైవప్రసన్నతే ధ్యేయంగా సాగిన సమరంలో పొందిన వీరమరణం. అందుకని ఆయన ఏ లక్ష్యం కోసం, ఏ ధ్యేయం కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడి అమరుడయ్యారో మనం దాన్నుండి స్ఫూర్తిని పొందాలి. సమాజంలో దుర్మార్గం ప్రబలినప్పుడు, ఉన్మాదం జడలు విప్పినప్పుడు, విలువల హననం జరుగుతున్నప్పుడు, ప్రజాస్వామ్య వ్యవస్థ బీటలు వారుతున్నప్పుడు సమాజ శ్రేయోభిలాషులు, ప్రజాస్వామ్య ప్రియులు, న్యాయ ప్రేమికులు, పౌరసమాజం తక్షణం స్పందించాలి. న్యాయంకోసం, ధర్మంకోసం, మానవీయ విలువల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పరిధిలో శక్తివంచన లేకుండా పోరాడాలి. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన ప్రస్తుత తరుణంలో దాన్ని కాపాడుకోడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి. విలువల ప్రేమికులందరూ ఒక్కటిగా ముందుకు కదలాలి. దానికి ఇమామ్ స్ఫూర్తి ప్రేరణ కావాలి.

# మరణ మర్మాన్ని తెలుసుకుని జీవించాలి

**- షేక్ అబ్దుల్ బాసిత్. కొత్త గూడెం**



**ఏంట్రా అబ్బాయ్!** ఈ మధ్య చావు చెప్పాపెట్టకుండా వచ్చేస్తుంది.

చెప్పి వస్తే మనం ఇంత ప్రశాంతంగా బతకగలమా బాబాయ్.

అది నిజమే అనుకో.

ఎందుకు బాబాయ్. ఎవరు చనిపోయారు .

కోట్లు ఖర్చు చేసి మరి మరణాన్ని కోరుకున్న సంఘటన చూసి బాధ కలిగింది రా అబ్బాయ్.

ఓ! మునిగి పోయిన టైటానిక్ ఓడను చూడడానికి వెళ్ళి మృత్యువు కౌగిట్లోకి వెళ్ళిన వారి గురించా నువ్వు చెబుతున్నది.

అవునురా అబ్బాయి.

అదొక్కటే కాదు బాబాయ్. మన కళ్ళ ముందు చనిపోతున్న ప్రతి ఒక్క చావు మనకు మన జీవిత మర్మాన్ని వివరించే ఒక చిహ్నం.

మానవాళి మార్గదర్శి, చావు పుట్టుకల నడమ మానవ జీవిత మర్మాన్ని వివరించే ఖురాన్ గ్రంథం ఈ మృత్యువు గురించి చాలా స్పష్టంగా వివరించింది.

ఏం చెప్పింది? ఏమని చెప్పిందో కాస్తా వివరంగా మాకు కూడా చెప్పరాదు తమ్ముడు.

అలాగే శంకరన్న . ముందుగా ఈ గరం గరం చాయ్ తాగండి.

ఆ- ఇప్పుడు చెప్పు తమ్ముడు.

పుట్టిన ప్రతి మనిషి మరణించక తప్పదు. ఇది మనందరికీ తెలిసిన జీవిత సత్యం.

పుట్టినప్పుడు వెంట తెచ్చుకున్నది ఏమి లేదు. పోయేటప్పుడు పట్టుకుని పోయేది కూడా ఏమి లేదు.

అంతే కదా మరి.

ఈ చావు పుట్టుక నడుమ జీవితం ఒక పరీక్ష. ఇక్కడ లభించిన జీవిత గడువులో దైవానికి భయపడుతూ, మంచివారిగా, న్యాయం, ధర్మం తప్పకుండా నీతిమంతుడిగా నిజాయితీగా జీవించమని ఇస్లాం బోధిస్తుంది.

మీలో మంచి పనులు చేసేవారు ఎవరో చూడాలని మేము (సృష్టికర్త అయిన అల్లాహ్) చావు పుట్టుకలను సృజించాము.

నిజమే రా అబ్బాయ్. క్షణభంగురమైన ప్రాపంచిక బోగలాలసాల మాయలో పడి మంచి  మానవత్వం మరచి పోతున్నారు. కని పెంచిన కన్నవారినే భారంగా భావిస్తున్నారు. నిన్న కాక మొన్న మనవడు కలెక్టర్. 30 కోట్ల ఆస్తి ఉన్న ముసలితనంలో బుక్కెడు అన్నం పెట్టే వారు లేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన వింటే మనసు ద్రవించుక పోయింది అనుకో.

అందుకే కదా బాబాయ్, మృత్యువును ఉదాహరణ గా చూపి మనిషికి జీవిత మర్మాన్ని తెలుసుకోమని హెచ్చరించాడు ఖురాన్‌లో అల్లాహ్.

ఇక మీరు గనక ఎవరికీ బానిస కాకపోతే, ఈ అభిప్రాయంలో మీరు గనక సత్యవంతులే అయితే, చనిపోయే వాడి ప్రాణం గొంతులోకి వచ్చినప్పుడు, అతడు చనిపోతున్నాడని మీరు కళ్లారా చూస్తూ ఉంటారు. ఆ సమయంలో పోయే ప్రాణాన్ని మీరు

తిరిగి ఎందుకు తీసుకురాలేరు? (56: 83-87).

నిజమే తమ్ముడు. ఈ భూమి మీద మనిషి చేయలేని పని ఏదైనా ఉంది అంటే అది చావును అపడం ఒక్కటే.

అవును శంకర్ అన్న. మరణం వ్రాయబడి ఉంది. అది ఒక్క క్షణం అటు ఇటు కానేకాదు.

మీరు మీ ఇళ్ళల్లోనే ఉండి వున్నప్పటికీ, మరణం వ్రాయబడి ఉన్నవారు స్వయంగా తమ వధ్యస్థానాలకు తరలివచ్చి ఉండేవారు. (3:154)

అందుకే కోట్లు పెట్టి చావును కొనుక్కుని మరీ సముద్ర గర్భంలోకి వెళ్ళి చనిపోయారు.

మరణం ఏ క్షణాన మనల్ని కబలిస్తుందో తెలియదు. ఈ క్షణమే నా చివరి గడియ అని భావించి జీవించాలి అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స).

చనిపోయిన ప్రతి ఒక్కరూ బ్రతికి ఉన్న వారితో. "ఓ మానవుడా! కళ్ళు తెరిచి నిజం తెలుసుకో. జీవిత మర్మాన్ని గ్రహించాలి. లభించిన జీవితాన్ని నిస్వార్థంగా కల్మషం లేకుండా, అనుక్షణం మంచి ఆలోచనలతో సాధ్యమైనంత వరకు మంచి పనులు చేస్తూ జీవించండి. వెంటరావని ఈ ప్రాపంచిక సిరి సంపదలు వెనుక వెర్రి వారిలా పరుగులు పెట్టకండి అని హెచ్చరిస్తారట.

కాని దురదృష్టం ఏమిటంటే, ప్రాపంచిక మాయ తెరలు కమ్ము కున్న మనకు ఆ హెచ్చరికను పట్టించుకోకుండా చేస్తుంది

నిజమే రా అబ్బాయ్. కళ్ళ ముందే వాస్తవాలు కదలాడుతున్న, కళ్ళ లేని కబోధిలా ఈ ప్రాపంచిక జీవితం లో మునిగిపోయాం.

ఈ విషయాన్ని అల్లాహ్ చాలా స్పష్టంగా ఖురాన్‌లో ఇలా హెచ్చ రించాడు.

బాగా తెలుసుకోండి ఈ లౌకిక జీవితం ఒక ఆట. వినోదం. బాహ్య పటాటోపం, సంపద సంతానాల విషయంలో ఒకరిపై ఒకరు ఆధిక్యత పొందడానికి ప్రయత్నించడం తప్ప మరేమీ కాదు. (57:20)

ఏమోరా అబ్బాయ్. మనం ఈ మాయా ప్రపంచం గురించి ఎప్పుడు తెలుసుకుంటాము ఏమో.

ఈ జీవితం శాశ్వతం కాదు. మరణం పొంచి ఉంది. అది ఏ క్షణాన మనల్ని కబలిస్తుందో తెలియదు. కనుక అను క్షణం మరణాన్ని జ్ఞాపకం చేసుకుంటూ వీలైనంత ఎక్కువ గా మంచి పనులు చేస్తూ జీవించాలి అప్పుడే మన ఈ జీవితానికి సాఫల్యం లభిస్తుంది.

అల్లాహ్ మనందరికీ ఇహ పరాలలో సాఫల్యం పొందే భాగ్యాన్ని ప్రసాదించు గాక.

# అబాబీల్ కవితలు

1.
కాలానికి కమ్మిన చిమ్మ చీకటి తొలగించాలని
ప్రజా జీవితం సదా ప్రభావితం చేయాలని
కఠిన హృదయాల్లో కరుణ పొంగించాలని
"సమదూ"
కలం కదలించి అబాబీల్ అల్లు..


2.
తల్లిదండ్రితో మంచిగా మసలుకో
ఇహపరాల్లో శుభాలు అందుకో
దైవానికి కృతజ్ఞతలు తెలుపుకో
"సమదూ"
సుందర సమాజం దర్శించుకో..

3.
భార్యతో సత్ప్రవర్తనతో గడుపు
స్త్రీల పట్ల మృదువుగా మసలు
పవిత్ర సమాజ నిర్మాణానికి పూనుకో
"సమదూ"
ఉత్తమ జీవన వ్యవస్థ స్థాపిస్తావు..

4.
యువతలో నిరుద్యోగ నైరాశ్యం
అదుపు తప్పినా ధరల విన్యాసం
అడుగడుగునా ప్రజల ఛీత్కారం
"సమదూ"
జనరంజక పాలనా కలగా మిగిలేనా..

5.
భగవద్గీత! ఖుర్ఆన్! బైబిల్!
మానవతా సుగంధాలు వెదజల్లు
సోదర భావాలు కురిపించు
"సమదూ"
అధికారం కోసం అడ్డుగోడలు కట్టొద్దు..

**- షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల**




**ఇస్లామీయ** సంప్రదాయం ప్రకారం, ఇస్లాం ధర్మం చూపిన విధంగా ముహర్రమ్ నెలను స్వాగతిస్తున్న సోదరులకు శుభాకాంక్షలు. ఇస్లామీయ క్యాలెండర్, హిజ్రీ శకంతో ప్రారంభ మవుతుంది. ఈ హిజ్రీ శకం చంద్రమానం ప్రకారం కొనసాగు తుంది.

కాలం ఒకరి కోసం ఆగదు. కాలగతిలో సంవత్సరాలు, క్యాలెండర్ల రూపంలో గతించి పోతుంటాయి. నూతన సంవత్సరాలు వస్తుం టాయి. వచ్చిన ప్రతి నూతన సంవత్సరం తన సమయాన్ని ముగించుకుని భూత కాలంలో కలిసిపోతుంది.

తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ చైత్రమాసంతో, క్రీస్తు శకం జనవరి మాసంతో ప్రారంభమైనట్లు ఇస్లామీయ క్యాలెండర్ హిజ్రీ శకం ముహర్రం మాసంతో ప్రారంభమవుతుంది. ఇస్లామీయ మొదటి మాసం ముహర్రం నెల పదో తేదీకి ఎంతో ప్రాముఖ్యత ఉంది.

ముహర్రం నెల పదో తేదీని ఆషూర అంటాము. హజ్రత్ ఆదం అలైహిస్సలాంను దైవం ముహర్రమ్ నెల 10వ తేదీనే సృష్టించాడు. ఆయనను స్వర్గానికి పంపిందీ ఈ రోజే. నూహ్ ప్రవక్త నావను కనీవిని ఎరుగని భయంకర తుఫాను నుండి రక్షించి ఒడ్డుకు చేర్చింది కూడా ఈ రోజే. యూనుస్ ప్రవక్తను చేప కడుపు నుండి బయటికి తీసి రక్షించడం జరిగింది. హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్ కొరకు దుర్మార్గుడైన నమ్రూద్ చక్రవర్తి ఏర్పాటు చేసిన అగ్నిగుండం దైవాజ్ఞ ప్రకారం చల్లని పూ వనంగా మారి పోయింది ఇదే రోజున. అల్లాహ్ భూమ్యాకాశాలు, పర్వతాలు, సముద్రాలూ, స్వర్గ నరకాలను సృజించాడు. దేవుడు హజ్రత్ మూసా(అలై), ఆయన సహచరులను ఫిరౌన్ దౌష్ట్యాల నుండి రక్షించి, సముద్రాన్ని దాటించిందీ, అలాగే ఫిరౌన్‌ను, అతని సహచరులను సముద్రంలో ముంచి వేసిందీ ఈ రోజే. ఈ సర్వ సృష్టి ఒకరోజు నాశనం కానుంది. ఆ రోజును ప్రళయం అంటాము. ఈ ప్రళయం కూడా ముహర్రం నెల పదో తేదీ శుక్రవారం నాడు వస్తుందని హదీసు గ్రంథాల ద్వారా తెలుస్తోంది.

రమజాన్ మాసంలో పాటించే ఉపవాసాల తరువాత, ముహర్రం నెలలో పాటించే నఫిల్ ఉపవాసాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. అవి ముహర్రం నెల 9,10 తేదీలలోకాని, 10,11వ తేదీలలో కాని పాటించాలని మహనీయులు ప్రవక్త ముహమ్మద్(స) తెలిపారు. వీటివల్ల మనిషి గత పాపాలన్నీ క్షమించబడతాయి.

ముహర్రం నెల అనగానే హజ్రత్ ఇమాం హసన్, హజ్రత్ ఇమాం హుసైన్ గార్లు, వారి త్యాగాలు మనకు గుర్తుకొస్తాయి. వీరిద్దరూ ప్రవక్త ముహమ్మద్(స) గారి మనవళ్ళు. ప్రవక్త ముహమ్మద్(స) శిక్షణలో తర్ఫీదు పొందిన వీరిద్దరూ చిన్న వయసు నుండే మంచి తెలివితేటలు, విషయ పరిజ్ఞానం, దీక్షాదక్షతలు గల సాహస వంతులు. వ్యక్తిగత జీవితంలోనూ మచ్చలేని మనుషులు. వారి జీవితం దైవభీతితో సాగేది. ఇంతటి ఉన్నత విలువలు గల హజ్రత్ ఇమాం హసన్, ఇమాం హుసైన్ గారి తల్లి హజ్రత్ ఫాతిమా (రజి), తండ్రి హజ్రత్ అలీ(రజి) గార్లు.

అల్లాహ్ ఈ భూమిపై దాదాపు లక్షా ఇరవై నాలుగు వేల మంది దైవప్రవక్తలను పంపించాడు. వీరందరూ అల్లాహ్ ధర్మాన్ని సర్వ మానవులకు తెలియజెయ్యడానికి పంపించబడినవారే. దైవప్రవక్త లలో మొట్టమొదటి వారు హజ్రత్ ఆదం (అలై) కాగా చిట్టచివరి వారు మహనీయులు ముహమ్మద్(స) గారు. ప్రవక్త ముహమ్మద్ (స) క్రీ.శ. 632వ సంవత్సరం పరమపదించారు. ఆ తరువాత ప్రజాస్వామ్య పద్ధతి ప్రకారం ప్రజలు తమ ప్రతినిధిగా హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(రజి) గారిని తొలి ఖలీఫాగా ఎన్నుకున్నారు. రెండవ వారు హజ్రత్ ఉమర్(రజి), మూడవ వారు హజ్రత్ ఉస్మానె గని(రజి), నాల్గవ వారు హజ్రత్ అలీ(రజి) గార్లు ప్రాతినిధ్య పద్ధతి ప్రకారం ఖలీఫాలు అయ్యారు. ఈ నలుగురు

ప్రతినిధులను ఖలీఫాలు అంటాము. వీరు క్రీ.శ. 632 నుంచి క్రీ.శ. 659వ సంవత్సరం వరకు 27 సం॥ పరిపాలించారు. వీరి పరిపాలనా కాలంలో సర్వత్రా న్యాయమే రాజ్యమేలింది. వీరు అందరికీ న్యాయవంత మైన పరిపాలన అందించారు. వీరి పరిపాలనా కాలం చరిత్రలో సువర్ణాధ్యయంగా నిలిచిపోయింది.

నలుగురు ఖలీఫాల పరిపాలన అనంతరం ప్రజలు తమ ప్రతినిధిగా హజ్రత్ ఇమామ్ హసన్ గారిని ఎన్నుకున్నారు. ఆ సమయంలో సిరియా ప్రాంతానికి గవర్నర్‌గా ఉన్న ముఆవియా మనసులో రాజ్యకాంక్ష తిష్టవేసి ఉండింది. అది హజ్రత్ ఇమాం హసన్ గారికి నచ్చలేదు. ఆయన రాజ్యంలో సంక్షోభాన్ని నివారించే సదుద్దేశంతో ప్రతినిధి పదవి నుండి వైదొలిగారు.

సిరియా ప్రాంతానికి గవర్నర్‌గా ఉన్న ముఆవియాకు అధికార వ్యామోహం పెరిగి తన కుమారుడు యజీద్‌ను రాజుగా గుర్తించ మని ప్రజలపై ఒత్తిడి తెచ్చాడు. కొంతమంది ప్రజలు తమ ధన,ప్రాణ నష్టాల భయం వల్ల యజీద్‌ను రాజుగా గుర్తించారు. మరికొందరు వ్యతిరేకించారు. ఈ ములూకియత్ (రాజరిక) ధోరణి మూలంగా ప్రజాస్వామిక వ్యవస్థకు దెబ్బ తగిలింది.

ముఆవియా కుమారుడు యజీద్‌ను రాజుగా గుర్తించడం ప్రజాస్వామ్య వాదులకు ఏమాత్రం నచ్చలేదు. వారు యజీద్‌కు ఎదురు తిరిగారు. సిరియా ప్రాంతంలో జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టి, న్యాయమైన మంచి పరిపాలన జరిగే విధంగా చూడమని, హజ్రత్ ఇమాం హుసైన్(రజి) గారికి కుఫా (సిరియా) ప్రజలు లేఖలు రాశారు.

సిరియా ప్రాంతంలోని పరిస్థితులను చక్కదిద్దడానికై హజ్రత్ ఇమాం హుసైన్ (రజి), సిరియా రాజధాని కూఫా పట్టణానికి బయలు దేరారు. వారి వెంట ఉన్న 72 మందిలో స్త్రీలు, పిల్లలు, వృద్ధులూ ఉన్నారు.

హజ్రత్ ఇమాం హుసైన్(రజి) గారు కూఫా పట్టణానికి చేరుకుంటే తన అధికారానికే ముప్పు వస్తుందని గ్రహించిన యజీద్ హజ్రత్ ఇమాం హుసైన్ గారిని మార్గమధ్యంలో అడ్డుకోవడానికి వేల సంఖ్యలో సైన్యాన్ని పంపించాడు.

ఒక ప్రక్క నుండి ఇమాం హుసైన్(రజి) వెళ్తున్నారు. వారికి ఎదురుగా మరోవైపు నుండి యజీద్ పంపిన శత్రు సైన్యం వస్తున్నారు. ఇద్దరూ కర్బలా అనే స్థలంలో ముఖాముఖి అయ్యారు. యజీద్ సైన్యాధిపతి ఇమాం హుసైన్ గారితో 'మీరు యజీద్‌ను రాజుగా గుర్తించాలి' అని అన్నాడు. ఆ విషయం ఇమాం గారికి ఏమాత్రం నచ్చలేదు. నేను నా లక్ష్యసాధన కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధమే కాని, అన్యాయానికి, దౌర్జన్యపరులకు తల వంచను అన్నారు.

వెంటనే ఇరు వర్గాల మధ్య భీకర పోరు ప్రారంభమైంది. కర్బలా మైదానం రక్తంతో ఎర్రబారిపోయింది. ధర్మసంస్థాపనా మార్గంలో కృషి చేస్తున్న ఇమాం ఎంతో ప్రయత్నం చేశారు. ఫలితం లేకుండా పోయింది. ఇమాం గారి పిల్లలు, స్త్రీలు, వృద్ధులకు గుక్కెడు మంచినీళ్ళు కూడా కరువైపోయాయి. ఇమాం గారి ఒకటిన్నర సంవత్సరాల బాలుడు నీటి కోసం అలమటిస్తుంటే యజీద్ సైన్యం ఆ బాలుడ్ని సైతం బాణంతో కొట్టి చంపారు.

ఇమాం గారి బృందంలో ఒక్కొక్కరుగా అందరూ అమరగతుల య్యారు. చివరకు ఇమాం హుసైన్(రజి) ఒక్కరే మిగిలారు. అది ముహర్రం నెల 10వ తేదీ శుక్రవారం. ఇమాం గారు శుక్రవారం నమాజ్ కోసం శత్రువుల వద్ద అనుమతి కోరి ప్రార్ధనలో నిమగ్నమై పోయారు. ఇమాం గారు ప్రార్థన ముగించుకొని వస్తే, తమ ప్రాణాలకే ముప్పు కలుగుతుందని భావించిన శత్రు సైన్యం ఇమాం గారిని ప్రార్థనలోనే బాణంతో కొట్టి చంపారు. క్రీ.శ. 626లో జన్మించిన ఇమాం గారు 45 సంవత్సరాలు జీవించి క్రీ.శ. 671లో ధర్మ సంస్థాపనా మార్గంలో అమరగతులయ్యారు.

ధర్మసంస్థాపన కోసం ప్రజాస్వామిక విలువల పరిరక్షణ కోసం, నిరంకుశ, నియంతృత్వ ధోరణుల నివారణ కోసం హజ్రత్ ఇమాం హుసైన్ ప్రాణత్యాగం చేశారు. ప్రపంచ ప్రజలు వారిని నేటికీ గుర్తు చేసుకుంటున్నారు.

మహనీయులు ముహమ్మద్(స) అల్లాహ్ ధర్మాన్ని ఈ భూమిపై స్థాపించి వెళ్ళిన అర్ధ శతాబ్దానికే ముహర్రం నెల 10వ తేదీని ఇరాక్‌లోని కర్బలా మైదానంలో సంభవించిన ఘటనా క్రమం ఎంతయినా విషాదకరమైనదే. అందులో స్వయాన ప్రవక్తగారి మనవడు హజ్రత్ ఇమాం హుసైన్(రజి), ఆయన కుటుంబ సభ్యులలో పలువురు అమరగతులైన వైనం కూడా అత్యంత విషాదకరమైనది.

హజ్రత్ ఇమాం హుసైన్(రజి) ఏ లక్ష్య సిద్ధి కోసం తమ ప్రాణా లను అర్పించారో, దాని కోసం మనమంతా నడుం బిగించాలి. నేడు కూడా సమాజంలో కొంతమంది యజీద్ వారసులు అనేక చోట్ల గద్దెలు ఆక్రమించుకుని తమ నియంతృత్వ పోకడలకు ప్రాణం పోస్తున్నారు. అందుకే ఇమాం హుసైన్ వారసులు కేవలం శోక ప్రకటనలతో, బాధ వ్యక్తీకరణలతో కాలం వెళ్ళబుచ్చకుండా యజీద్ శక్తులను అన్ని మైదానాలలో ఎదుర్కొనేందుకు సంసిద్ధులు కావలసిన అవసరం ఉంది. ●



# నమాజ్ పట్ల నిర్లక్ష్యం క్షంతవ్యం కాదు

- నసీరా బేగం

**ఒక** మనిషి అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను హృదయపూర్వకంగా విశ్వసించిన తరువాత అతనిపై మొట్టమొదట విధించబడేది నమాజ్. ఆ మనిషి పురుషుడైనా, స్త్రీ అయినా, ఆరోగ్యవంతుడైనా, రోగి అయినా, బలవంతుడైనా, బలహీనుడైనా, యవ్వన దశలో ఉన్నా ముసలి దశలో ఉన్నా రాజు అయినా, బానిస అయినా ఇంట్లో ఉన్నా ప్రయాణంలో ఉన్నా, సంతోషంలో ఉన్నా దుఃఖంలో ఉన్నా, ధనవంతులైనా, పేదవారైనా, మండుటెండల్లో ఉన్నా, తీవ్రమైన చలి ఉన్నా, చివరకు ఘోర యుద్ధం జరుగుతూ ఉన్నా ప్రతి విశ్వాసి అయిదు పూటల నమాజు చెయ్యవలసిందే. నమాజ్ అనేది ఎట్టి పరిస్థితుల్లోను క్షమించబడదు. ఈ విధిని గురించి ఖుర్‌ఆన్, హదీసు గ్రంథాలలో స్పష్టంగా తెలియజేయబడి ఉంది. కాని అత్యంత బాధాకరమైన విషయమేమిటంటే, చాలా మంది తమను తాము ముస్లిములుగా భావించినప్పటికీ, ముఖ్య మైన ఈ ఆరాధన పట్ల విముఖత చూపుతూ ఉంటారు. నిర్లక్ష్యం వహిస్తూ ఉంటారు.

మొట్టమొదటిది నమాజ్ చెయ్యటంలో బద్ధకం. నమాజ్ చెయ్యని కొంతమందికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పుడు వారు కేవలం శుక్రవారం జుమా నమాజ్ చెయ్యటానికి, పండుగల నమాజ్ చెయ్యటానికి సిద్ధపడతారు. దీనికారణంగానే జుమా రోజున పండుగల రోజున మసీదులు కిక్కిరిసిపోతాయి. ఇంకా రమజాన్ మాసంలో కూడా అలాంటి వారు క్రమం తప్పకుండా చేస్తారు. ఇలాంటి వారిని చూసినప్పుడు చాలా ఆశ్చర్యమేస్తుంది. వారికి నమాజు తనపై విధి అని తెలిసినప్పటికీ నమాజుతో వారికి సంబంధం ఉన్నప్పటికీ బద్ధకం వలదు. అల్లాహ్ మానవులను కేవలం తన ఆరాధన కోసం పుట్టించానని స్పష్టంగా తన గ్రంథంలో సెలవిస్తున్నాడు. ఆ ఆరాధనలలో మొట్టమొదటి ఆరాధన నమాజ్. నమాజ్ చెయ్యని వారికి సమాధి నుండే అతనికి కఠినాతి కఠినమైన శిక్షను ప్రారంభించటం జరుగుతుంది. ఇంకా ప్రళయ దినం నాడు లెక్క తీసుకోవటం ప్రారంభించినప్పుడు మొట్ట మొదట నమాజ్ గురించే ప్రశ్నించడం జరుగుతుంది. నమాజ్ చెయ్యని వారికి నమాజ్ చెయ్యటం అనేది చాలా కష్టంగా, బరువైన బాధ్యతగా అనిపిస్తుంది. కాని క్రమం తప్పకుండా నమాజు చేసేవారికి అది అతి తేలికైనదిగా, ఇష్టమైనదిగా, ప్రియ మైనదిగా, శాంతివంతమైనదిగా, గుండె నిబ్బరమైనదిగా అనిపిస్తుంది. ఎందుకంటే నమాజ్ ప్రభువుకు దాసునికి మధ్యన సంబంధాన్ని ఏర్పరుస్తుంది. ఐదు పూటల నమాజ్ ఈ బంధాన్ని మరింత దృఢత్వాన్ని ప్రసాదిస్తుంది. తన ప్రభువుకు తాను అత్యంత ప్రియమైన దాసుడిననే మధురమైన భావనను స్ఫురింపజేస్తుంది. కనుకనే ఐదు పూటల నమాజీ అజాన్ పిలుపు కోసం ఆతృతతో ఎదురుచూస్తూ ఉంటాడు. అజాన్ అవ్వగానే వడివడిగా అడుగులేసుకుంటూ మస్జిద్‌కు చేరుకుంటాడు. క్రమం తప్పకుండా నమాజ్ చెయ్యనివారు ఐదుపూటల నమాజ్ కోసం మస్జిద్‌కు పరుగులు పెట్టి చూసుకోవాలి. దాని అనుభూతి ఎలా ఉంటుందో.

ఇంకా ఐదు పూటల బాధ్యతగా నమాజు చేసేవాడు జీవితానికి సంబంధించిన ఇతర పనులలో కూడా బాధ్యతగా ఉంటాడు. నమాజు పట్ల బాధ్యతా రహితంగా మసలుకునేవాడు ఇతర పనులలో కూడా బాధ్యతా రహితంగానే వ్యవహరిస్తాడు. అతని జీవితంలో అతనికి ప్రశాంతత ఉండదు. అతని ద్వారా ఇతరు

లకు ప్రశాంతత అనేది లభించదు. హజ్రత్ ఉమర్(రజి) తన గవర్నర్‌లకు ఇలా ఆదేశించారు. మీ కార్యాలన్నింటిలో నాకు అత్యంత ముఖ్యమైనది నమాజ్. ఎవరైతే నమాజును దాని సమయం ప్రకారం చేసి కాపాడుకున్నారో అతను పూర్తి ధర్మాన్ని కాపాడాడు. ఎవరైతే నమాజును నష్టపరిచాడో అతను పూర్తి ధర్మాన్నే నష్టపరిచే వాడైపోతాడు.

రెండోది; నమాజుపై తన ప్రాపంచిక వ్యవహారాలను ప్రాముఖ్యతను ఇవ్వటం. కొంతమంది ప్రజలకు నమాజులను క్రమం తప్పకుండా చెయ్యాలని బోధిస్తే వారు తల్లిదండ్రులు, భార్యాపిల్లల బాధ్యతలు తమపై ఉన్నాయని ఆ బాధ్యతలను పూర్తి చెయ్యటంలో సంపాదనలో నిమగ్నమై ఉన్న కారణంగా ఐదుపూటలా నమాజును చెయ్యలేకపోతున్నామని సమాధానం పలుకుతారు. అర్థం చేసుకోవలసిన విషయమేమిటంటే, ఆ బాధ్యతల నుంచి తప్పించుకొని నమాజులే చెయ్యమని బోధించటంలేదు. నమాజును ఆచరించండి, బాధ్యతలను కూడా పూర్తి చెయ్యండి. దాని కోసం ఉపమానంగా దైవప్రవక్త(స), ఆయన గారి అనుచరులను తీసుకోండి. వారు బాధ్యతలన్నింటిని చక్కగా పూర్తి చేసేవారు. హజ్రత్ ఆయెషా(ర) ఇలా సెలవిచ్చారు; దైవ ప్రవక్త(స) మాతో మాట్లాడుతూ ఉండేవారు. మేము ఆయన(స) గారితో మాట్లాడుతూ ఉండేవారము. అంతలోనే అజాన్ అయ్యేది. అజాన్ పిలుపు వినగానే ఆయన మేము ఎవరో, ఆయన ఎవరో అనే విధంగా అయిపోయేవారు. మస్జిద్‌కు వెళ్ళిపోయేవారు.

మూడోది; అనారోగ్యానికి గురైనప్పుడు కూడా నమాజ్‌ను నిర్లక్ష్యం చెయ్యటం జరుగుతుంది. వాస్తవానికి వ్యాధిగ్రస్తులైనప్పుడు ఇంకా ఎక్కువగా నమాజులు చేసుకోవాలి. ఎందుకంటే స్వస్థతను ప్రసాదించేవాడు అల్లాహ్‌యే. ఇంకా ఆ అనారోగ్యంతో ఉన్నప్పుడు మరణం సంభవించే అవకాశాలు ఎక్కువైపోతాయి. వ్యాధిగ్రస్తులకు అల్లాహ్ వారు ఏ పరిస్థితిలో ఎలా చెయ్యగలిగితే అలాగే చేసుకునే అవకాశాన్ని కల్పించాడు. దైవప్రవక్త(స) తన చివరి వ్యాధిలో కూడాను ఇతరుల సహాయంతో మస్జిద్‌కు వెళ్ళి నమాజు చేయించారు.

నాలుగవది; ప్రయాణంలో కూడా నమాజును నిర్లక్ష్యం చెయ్యటం జరుగుతుంది. ప్రయాణంలో కూడా నమాజు చెయ్యటం తప్పనిసరి. కాని సిగ్గుతోనో లేదా నిర్లక్ష్యంతోనో వదిలేస్తారు. క్రమం తప్పకుండా చేసేవారు కూడా నిర్లక్ష్యం వహిస్తారు. స్థానికంగా ఉన్నా ప్రయాణంలో ఉన్నా నమాజు విధిగా చెయ్యవలసిందే. అయితే ప్రయాణంలో నమాజు సంఖ్య తగ్గించబడింది. వుజూ కోసం నీరు లభించని కారణంగా తయమ్ముమ్ చేసుకుని నమాజ్ చేసుకోవాలి. దైవప్రవక్త(స) ప్రయాణంలో కూడా ఎప్పుడు నమాజ్‌ను వదలలేదు. చివరకు యుద్ధ మైదానంలో కూడా జమాఅత్‌తో నమాజ్ ఆచరింపజేసేవారు. కనుక తన సౌకర్యాని కనుగుణంగా తప్పకుండా ప్రయాణంలో కూడా నమాజు చెయ్య వలసిందే.

ఐదోది; తమ పనులలో నిమగ్నమై ఉన్న కారణంగా జమాఅత్‌ను వదలి వెయ్యటం జరుగుతుంది. ప్రతి ముస్లిమ్ పురుషునిపై మస్జిద్‌కు వెళ్ళి జమాఅత్‌తో ఫర్జ్ నమాజ్ చెయ్యటం తప్పనిసరి. కాని జరిగేదేమిటంటే చిన్న చిన్న సాకులతో మస్జిద్‌కు వెళ్ళకుండా ఇంట్లోనే నమాజ్ చేస్తూ ఉంటారు. ఇది ఎంతమాత్రమూ మంచిది కాదు. ఒకవేళ అప్పుడప్పుడు అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తప్ప పురుషులు మస్జిద్‌కు వెళ్ళి నమాజ్ చెయ్యటంలో ఎన్నో లాభాలు నిక్షిప్తమై ఉన్నాయి. వాటన్నింటికీ వీరు దూరమైపోతారు. అధిక పుణ్యాన్ని పోగొట్టుకుంటారు.

ఆరోది; స్త్రీలు సమయంపై ఏకాగ్రతతో నమాజును చెయ్యక పోవటం. చాలామంది స్త్రీలు ఇంటి పనులలో నిమగ్నమై ఉన్న కారణంగా నమాజ్‌ను సమయం అవ్వగానే ఆచరించరు. పనులన్నీ పూర్తయిన తర్వాత సమయం దాటిపోయిన తరువాత నమాజ్ చేస్తారు. ఇది ఎంతమాత్రము లాభదాయకం కాదు. ప్రతి నమాజ్ సమయం తెలిసిన తరువాత కూడా పనులన్నీ దానికనుగుణంగా సరిదిద్దుకోకపోవటం అనేది వారి నిర్లక్ష్యాన్ని సూచిస్తుంది. దానిద్వారా వారు నమాజ్ చేసిన తరువాత కూడా పూర్తి ప్రతిఫలాన్ని పొందలేకపోతారు. ఇంకా స్త్రీలు ఇంట్లోనే నమాజ్‌చేస్తారు. కాబట్టి వారు పూర్తి ఏకాగ్రతతో చెయ్యలేకపోతారు. ఇంట్లోని సభ్యుల కారణంగానో, ఇతర పనుల కారణంగానో లేక ఎవరో ఒకరు రానుపోను కారణంగా, ఫోన్ కారణంగానూ వారు పూర్తి ఏకాగ్రతను పొందలేకపోతారు. కనుక వారు నమాజ్ సమయంలో పూర్వం పనులన్నీ చక్కదిద్దుకోవాలి. లేదా తరువాత చేసుకోవాలి. ఇంట్లోని ఒక గది మూలలో నమాజ్‌కు ఏర్పాట్లు చేసుకోవాలి. ఫోన్‌ను నిశ్శబ్ద మూడ్‌లో వేసి ఉంచాలి. అప్పుడు చక్కగా, హాయిగా స్త్రీలు నమాజ్ చేసుకోగలుగుతారు.

ఏడోది; పిల్లల నమాజ్ పట్ల నిర్లక్ష్యం వహిస్తారు. తల్లిదండ్రులకు పిల్లల ఇతర విషయాలపై ఎంత బాధ్యత ఉందో అంతకంటే ఎక్కువ వారి నమాజ్‌ల పట్ల కూడా బాధ్యత ఉంది. ఆ బాధ్యతను నెరవేర్చకపోతే వారు అల్లాహ్ సమక్షంలో సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. కనుకనే పిల్లలను ఏడు సంవత్సరాల వయసులో నమాజ్‌కు అలవాటు చెయ్యమని, పది సంవత్సరాలైనప్పుడు దండించమని కూడా చెప్పబడింది. కనుక పిల్లలు ఐదు పూటలా నమాజ్ చేసే విధంగా చూసుకోవాలి.

కథ

- షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల



# ప్రయాణం

**రాత్రి** భోజనం చేసి భర్తతో రిలాక్స్‌గా టీవీ న్యూస్ చూస్తున్న డాక్టర్ నాగమణి ఒక్కసారి అలెర్ట్ అయింది. సరిహద్దులో జరిగిన ఉగ్రవాద దాడిలో సెకెండ్ లెఫ్టినెంట్ హమీద్ నాయకత్వంలో వీరోచిత పోరాటంలో ఇద్దరు ఆర్మీ జవాన్లు మృతి చెందారని హమీద్‌కు తీవ్ర గాయాలయ్యాయని హెలికాప్టర్‌లో మిలటరీ హాస్పిటల్‌కు తరలించారని వార్త. హమీద్ చాకచక్యంగా పది మంది ఉగ్రవాదులను బందీలుగా పట్టుకున్నాడు. ఆరుగురు ఉగ్రవాదులు కాల్పుల్లో మరణించినట్లు వార్త హమీద్ ఫోటోతో సహా చూపిస్తున్నారు. మరణించిన జవాన్ల కుటుంబాలకు సంతాపం తెలుపుతున్నారు. వార్తలు నడుస్తున్నాయి. నాగమణి టెన్షన్ చూసి ఏమైంది మణి! ఇవన్నీ మామూలే డోంట్ ఎగ్జయిట్ అంటు దగ్గరికి వచ్చి కూర్చొంటూ టీవి ఆఫ్ చేశాడు భర్త. లేదండి! ఆ అబ్బాయిని అల్లాహ్ తప్పక చల్లగా చూస్తాడు అని, భర్త ఇచ్చిన గ్లాసులో నీళ్ళు త్రాగి, ఆరు ఏడు నెలల క్రితం జర్నీలో తోటి ప్యాసింజర్‌గా హమీద్ పరిచయం గుర్తు చేసుకుంది. మేడ మీద నుండి దిగివచ్చిన కూతురు వాళ్ళతో జాయిన్ అయింది.

అమరావతి రైలు హౌరా రైల్వేస్టేషన్ నుండి రెండు సార్లు కూతపెట్టి ప్రయాణికుల బంధువుల వీడ్కోలు అందుకుంటూ తన గమ్యం వైపు చిన్నగా బయలుదేరింది. అప్పటికే రాత్రి పదకొండు గంటలు అయింది. ప్రయాణికులు వస్తూనే తమ సీట్లు కన్ఫం చేసుకుని పడుకుంటున్నారు. కొద్ది మంది నిద్రకు ఉపక్రమించారు. అయితె ఇంకా రైలులో చాలా మంది చేతుల్లో సెల్ ఫోన్లు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. రబింద్రనాథ్ ఠాకూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.నాగమణి పై సీటులో సెల్ లో లీనమైనా కూతురును ఇంకా పడుకోమ్మా అని తాను నిద్రకు ఉపక్రమించే ప్రయత్నం చేసింది.

రాత్రి ఒంటిగంట అవుతున్న నాగమణికి నిద్ర పట్టలేదు. ఎదురు సీట్‌లో ఒక ఆర్మీ పర్సన్ ఉన్నాడు. అతని కటింగ్ వగైరా అతనో మిలటరీ వాడని తెలుపుతున్నాయి. డాక్టర్ నాగమణి రైలు ప్రయాణం బహు అరుదుగా చేస్తుంది. ఫ్లైట్‌లోనే చాలా సార్లు తన ప్రయాణం ఉంటుంది. ఫ్లైట్స్ ఐదు రోజులు రద్దు అయి ఉన్నాయి. కార్లో వద్దామంటె రెగ్యూలర్ డ్రైవర్ చటర్జీ ఆరోగ్యం బాగోలేదని సెలవులో ఉన్నాడు. అమ్మాయిని తీసుకొని క్రొత్త డ్రయివర్తో ఇద్దరు మహిళలు వద్దని భర్త వారించారు. ఏసి కొచ్‌లో కూడా సీటు దొరకలేదు. చివరకు ఏదో తాత్కాల్‌లో ప్రయాణం ఇలా ఫిక్స్ అయింది. భర్త డా.కిశోర్ రావు కూడా బెంగళూర్ యూనివర్సిటీలో ప్రొఫెసర్. నాగమణి గత సంవత్సరమే ప్రమోషన్‌లో కలకత్తా వచ్చారు. అమ్మాయి మంగళూర్ మెడికల్ కాలేజిలో మెడిసిన్‌లో యం.డి చేస్తుంది. ఓ లీగల్ కేసులో డా.నాగమణి రావడం అవసరం అయింది. తమ లాయర్‌తో డీల్ చేద్దాం అంటే అది ఓ పాత కాలేజి కేస్ దాన్ని క్లోజ్ చేద్దాం, ఆల్రెడీ అందరి స్టేట్మెంట్స్ రికార్డ్ చేసారు అని యూనివర్సిటీ రిజిస్ట్రార్ కోరడంతో తాను రావడం తప్పనిసరి అయింది. భర్త పిల్లలు అంతా బెంగుళూరులో ఉన్నారు కాబట్టి తాను తరచు వస్తూ వెళుతుంది.

నిద్ర కోసం ఉపక్రమిస్తూ కాకతాళీయంగా అలా చూసారు నాగమణి. ఆర్మి పర్సన్ భార్యకు సపర్యలు చేస్తున్నాడు. ఆమెకు తల నొస్తున్నట్టు ఉంది పైగా జ్వరం వచ్చినట్టు ఉందేమో భార్యను బుజ్జగిస్తూ టాబ్లెట్ వేసినాడు. ఆమె గర్భవతిలా ఉంది. ఏదో జోక్ చేస్తూ ఆమె వద్దంటున్నా కాళ్ళు వత్తుతున్నాడు.

ఆమె ఎవరన్నా చూస్తారని సైగ చేస్తుంటే, ఎవరు చూస్తే మనకేం అంటు భార్యకు తల నొక్కుతున్నాడు. పై సీట్లో వెళ్ళమంటుంటే వినటంలేదు. ఏదో భార్య భర్తల సరసం ఎందుకులే అనుకుంటూ సభ్యత అడ్డువచ్చిన వారి ముచ్చట కూడా చూడకూడదనుకుంటూ చూస్తుంది. తన కూతురు డాక్టర్, ఏదన్నా అవసరం అయితే నిద్ర లేపుదాం అనుకుంది. అతను భార్యకు శాలువా కప్పి, నుదిటిపై ముద్దాడి తన సీటెక్కి పడుకున్నాడు.

రాత్రి సమయం తెలియడంలేదు. మళ్ళీ ఏదో చిన్న శబ్దం అవుతుంటే నాగమణి క్రింద వైపు చూసింది. ఎదుటి సీటు ఆర్మీ పర్సన్ టిఫిన్ తీసి తింటున్నాడు. భార్యా సహాయం చేద్దాం అంటున్న వద్దు అంటూ తానే చూసుకొని తిని, ఫ్లాస్కులోని బోర్నవిట తాను ఒక కప్పులో వేసుకొని, భార్యకు ఓ కప్పు ఇచ్చాడు. వేసవి కాలం అయిన రన్నింగ్ ట్రయిన్ కాబట్టి గాలి వస్తుంది. డాక్టర్ మేడమ్‌కు అర్థం కావటం లేదు. తెల్లవారుజామున ఈ భోజనం ఎంటో అర్థం కాలేదు, ఏదన్నా కావాలేమో అడుగు దామని కొద్దిసేపు తటపటాయించి, చివరకు భార్యను అడిగింది, “ఏమ్మా! ఏమైనా బిస్కెట్లు కావాలా” వద్దూ, వద్దు మేడమ్! ఆయన రమజాన్ కాబట్టి సహరీ చేస్తున్నారు.. అదే రోజా. నేను జర్నీలో వద్దంటున్నా వినడం లేదు మేడం అంటు జనాలకు నిద్రా భంగం అవుతుందని చిన్నగా చెప్పింది. ఈ వయసులో ఇంతా నిష్ఠాగరిష్టుడా అనుకుంటూ ప్రక్కకు తిరిగి పడుకున్నారు నాగమణి మేడమ్. రైలూ ముందుకు వెళ్ళడమే తన బాధ్యత అయినట్లు వేగంగా దూసుకుని పోతుంది.

పూర్తిగా తెల్లవారింది. చాలామంది బ్రష్ చేసుకుంటున్నారు. కొందరు సెల్ ఫోన్‌లో లీనమై ఉన్నారు. చాయ్ వాలాలు రౌండ్లు కొడుతున్నారు. ప్రయాణిస్తున్న రైలు ఒక్కసారిగా పెద్దకుదుపుతో ఆగిపోయింది. నిద్రలో ఉన్నవారు కూడా ఒక్కోసారి లేచి కూర్చున్నారు. ఎవరికి అర్థం కావడం లేదు. రాత్రి అయితే ఏదో దొంగల భయం కాని ఇప్పుడు బయట పెద్ద గలభ అవుతూంది. డ్యూటి జిఆర్పి పోలీసులు చేరుకున్నారు. రైలుకు అడ్డంగా వచ్చిన రెండు బర్రెలు కమ్మెలు దాటుతూ రైలు చక్రాల క్రింద నలిగిపోయాయి. ఊరి పల్లెవాసుల రైలుకు అడ్డంగా కూర్చొని రైలును వెళ్ళనీయం అంటున్నారు. పోలీసులు వారించి మీ మీద కేసు పెట్టాల్సి వస్తుంది, రైలు ట్రాక్‌పై పశువులు తీసుకొని దాటటం తప్పు అంటుంటే యువత రెచ్చిపోతుంది. అర్ధగంట లేటు అయింది. అప్పటికే అక్కడ చేరుకున్న ఆర్మీ పర్సన్ వూరి వారిని సముదాయించి, పోలీసులతో యువతతో మాట్లాడారు. రాళ్ళతో దాడికి సిద్ధమైన యువత ఆర్మీవాలాకు షేక్ హ్యాండ్ ఇచ్చి తప్పుకున్నారు. దిగిన జనాలు బిలబిలా ఎవరి కంపార్ట్మెంట్ వాళ్ళు ఎక్కేసారు. పోలీసులు సైతం ఆర్మీ పర్సన్‌కు సెల్యూట్ చేసి కోచ్ వరకు వచ్చి వదిలారు. రైలు మళ్ళీ కూత పెట్టి తన గమ్యం వైపు దూసుకుని పోతుంది. రైల్లో చాలామంది మీరు బాగా డీల్ చేసారు సార్! లేకుంటే ఊరివాళ్ళు తిరగబడే వాళ్ళు, పది సంవత్సరాల క్రితం అలాగే రైలుపై దాడి చేసి ప్రయాణికు లను కూడా కొట్టారు అంటు గతం గుర్తు చేస్తున్నారు. బెర్తులు ఎత్తి చాలామంది తమతమ సీట్లలో కూర్చున్నారు. ఆ కోచ్‌లో ఆర్మీ పర్సన్ అట్రాక్షన్ అయ్యాడు. డా.నాగమణి అందరి కామెంట్స్ వింటున్నారు.

ఈ మధ్య నాగమణి గారు ఆర్మీ పర్సన్ భార్యను అతని గురించి ఆడిగింది. అవును మేడం అయన హబీబ్, బీ.టెక్ చదివి ఎన్డీఏ పరీక్ష పాసై డైరెక్టుగా సెకెండ్ లెఫ్టినెంట్ ర్యాంక్‌లో జమ్మూలో ఉన్నారు. ఈ మధ్యే ఖడగ్పూర్ వచ్చాం అని, తనే రైలు జర్నీకి ప్రపోజ్ చేసినట్లు తెలుగులో మధ్య మధ్య ఇంగ్లీషులో చెప్పింది. తను హమీదా బి.ఎడ్ చేసాననీ, తమది అరేంజ్డ్ వివాహం అంటూ తనకు ఆరు నెలలు కాబట్టి పుట్టింటికి వెళుతున్నాం అని తెలిపింది. హమీద్ వచ్చి జాయిన్ అయ్యాడు. రైలు విజయవాడ వచ్చింది. చాలా మంది దిగి పోయారు, బోగీలు ఖాళీ అయ్యాయి. లంచ్ టైమ్, తాను ఉపవాసంలో ఉన్నాడు కాబట్టి హమీద్ భార్యకు భోజనం తెప్పించాడు. మీకు ఎమన్నా కావాలా మేడం అంటు అడిగాడు. మార్కాపురంలో హమీద్ దంపతులు బై చెప్పి దిగిపోయారు. కొన్ని గంటల ప్రయాణమే అయిన హమీద్ దంపతులు అపుడపుడు గుర్తుకు వచ్చేవారు. వాళ్ళు సెల్ నెం కూడా తీసుకోలేదు. తన కూతురుకు భార్యను ప్రేమగా చూసుకొనే హమీద్ లాంటి భర్త రావాలని తల్లిగా ఆలోచించేది. అలా యాంత్రికంగా మరిచిపోతున్న తరుణంలో నేటి వార్త మళ్ళీ ఆ ఆర్మీ జంటను గుర్తుకు తెచ్చాయి. వాళ్ళకు చిన్న పాపనో బాబో ఉంటాడు. దేవుడు హమీద్ కుటుంబాన్ని చల్లగా చూడాలని మరోసారి ప్రార్థించింది డా.నాగమణి.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
గీటురాయి
వారపత్రిక




## ఢిల్లీలోని ప్రముఖ స్టేడియంలో బాహాటంగా ముస్లిం విద్వేష ప్రసంగాలు

ఢిల్లీలోని తాల్కతోరా స్టేడియంలో మతోన్మాద విద్వేష ప్రసంగాలు అడ్డుఅదుపు లేకుండా జరిగాయి. అంతర్రాష్ట్రీయ హిందూ పరిషద్ విరాట్ హిందూ సమ్మేళన్ కార్యక్రమం జులై 9వ తేదీన జరిగింది. ఈ కార్యక్రమంలో హిందూత్వ నేత సమీక్షా సింగ్ ముస్లిములపై హింసా హత్యాకాండలను రెచ్చగొట్టే విద్వేష ప్రసంగం చేసింది. ముస్లిములను జిహాదీలని, ప్రతి జిహాదీ కరడుగట్టిన హిందువు చంపినప్పుడు ఓడిపోతాడని, హిందువుల పెద్ద సమస్య వారి మానవత్వం, కరుణ జాలి అని వీరంగాలు వేసింది. మనల్ని ఒక చెంపపై కొడితే అతని రెండు చేతులు విరిచేయాలని చెప్పింది. ముస్లిములపై హింసాకాండను రెచ్చగొట్టే ఈ ప్రసంగాలు ప్రజలను రెచ్చగొట్టడానికి ఉద్దేశ్యపూర్వకంగా చేసిన ప్రసంగాలని విశ్లేషకుల అభిప్రాయం. ఈ కార్యక్రమంలో ప్రస్తుతం విశ్వహిందూ పరిషద్ నుంచి ఉద్వాసనకు గురైన ప్రవీణ్ తోగాడియా కూడా మాట్లాడాడు. రెచ్చగొట్టే ప్రసంగం చేశాడు. ముస్లిముల జనాభా పెరగడాన్ని హిందువులు అనుమతించరాదని తోగాడియా అన్నాడు. మోడీ ప్రభుత్వాన్ని ఇప్పుడు మంచి చేసుకునే ప్రయత్నాల్లో తోగాడియా ఉన్నట్లు కనిపిస్తోందని పలువురు భావిస్తున్నారు, ఎందుకంటే ప్రస్తుత ప్రభుత్వం రామమందిరాన్ని కట్టిస్తోందని, యూనిఫాం సివిల్ కోడ్ తీసుకువస్తుందని, లోక్ సభ ఎన్నికలకు ముందు జనాభా నియంత్రణ బిల్లు కూడా వస్తుందని, ప్రస్తుత ప్రభుత్వం చాలా బాగా పనిచేస్తోందని అన్నాడు. బాహాటంగా మతతత్వ, విద్వేష ప్రసంగాలు జరుగుతుంటే పోలీసులు, ప్రభుత్వం ఏం చేస్తుందన్న ప్రశ్న ఎప్పటి మాదిరిగానే జవాబు లేని ప్రశ్న.

## యూనిఫాం సివిల్ కోడ్ పై అభిప్రాయాలు తెలియజేసే తుది గడువు జులై 28 వరకు పెంచిన లా కమీషన్

జూన్ 14 లోపు యూనిఫాం సివిల్ కోడ్‌పై అభిప్రాయాలను పంపాలని కోరిన లా కమీషన్ ఇప్పుడు ఈ గడువును పెంచింది. జులై 28 వరకు అభిప్రాయాలు పంపవచ్చని తెలిపింది. గడువు పెంచాలని పలువురు విజ్ఞప్తి చేశారని అందువల్ల గడువు పెంచుతున్నామని, చాలా పెద్ద సంఖ్యలో అభిప్రాయాలు, సూచనలు వచ్చాయని లా కమీషన్  తెలియజేసింది. కాగా యూనిఫాం సివిల్ కోడ్ విషయంలో ప్రయత్నాలు కొనసాగించ వద్దని అకాలీదళ్ లా కమీషన్‌ను కోరింది. దేశవ్యాప్తంగా మత వర్గాల ఏకాభిప్రాయం లేకుండా ఉమ్మడి పౌరస్మృతి కోసం ప్రయత్నించడం అంటే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని తెలియ జేసింది. శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్ బీర్ సింగ్ బాదల్ ఒక లేఖ రాస్తూ సమైక్యత అంటే అందరూ  ఒకేమాదిరిగా ఉండడం కాదని అన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని చెప్పారు. పంజాబ్ వంటి సరిహద్దు రాష్ట్రంలో శాంతి సామరస్యాల సమాజం చాలా అవసరమని పేర్కొన్నారు. శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు లా కమీషన్ కు తన అభిప్రాయం రాస్తూ తమ సలహా సంప్రదింపులు, అభిప్రాయ సేకరణలో చాలా మంది యునిఫాం సివిల్ కోడ్ పట్ల వ్యతిరేకత చూపించారని, దీనివల్ల దేశంలోని వివిధ మతాలు, కులాలు, సముదాయాల స్వేచ్ఛలు దెబ్బ తింటాయని పేర్కొన్నారు.

## ఎమ్మెస్ ఐఏయస్ అకాడమీ ప్రవేశ పరీక్ష

ఎమ్మెస్ ఐఏయస్ అకాడమీ సివిల్ పరీక్షలకు కోచింగ్ ఉచితంగా అందజేస్తుంది. ఈ కోచింగ్ ప్రవేశ పరీక్ష తేదీలను ఎమ్మెస్ ఐయేయస్ అకాడమీ ప్రకటించింది. 2023-24 ఏడవ బ్యాచ్‌కు ఇప్పుడు ధరఖాస్తులు తీసుకుంటున్నారు. జులై 30వ తేదీ ఆదివారం నాడు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. జులై 16న ఈ పరీక్ష జరపాలని మొదట భావించారు. కాని ఇప్పుడు ఈ పరీక్ష జులై 30న జరపాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎమ్మెస్ ఎడ్యుకేషన్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ అన్వర్ అహ్మద్ మాట్లాడుతూ ఎమ్మెస్ ఐయేయస్ అకామీకి చెందిన విద్యార్థులు ముహమ్మద్ బుర్హాన్ జమాన్, ముహమ్మద్ ఫైజాన్ అహ్మద్, ముహమ్మద్ హారిస్ సుమేర్ సివిల్స్ లో విజయం సాధించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత ఇనుమడించిన ఉత్సాహంతో విద్యార్థులకు శిక్షణ అందజేస్తామని అన్నారు. ఈ బ్యాచ్ కోసం 23 రాష్ట్రాల్లో 80 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. తెలంగాణాలో హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్, వరంగల్, సిద్ధిపేట, ఆదిలాబాదుల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెస్ ఐయేయస్ అకాడమీ ఎన్నికైన విద్యార్థులకు పూర్తి స్థాయి రెసిడెన్షియల్ కోచింగ్ నిర్వహిస్తుంది. భోజన వసతి సదుపాయాలు ఉచితంగా కల్పిస్తుంది. అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు, బ్యూరోక్రాట్లు, సీనియర్ సివిల్ సర్వెంట్లు వారికి కోచింగ్ ఇస్తారు. మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఏ.కే.ఖాన్ ఈ అకడమీని పర్యవేక్షిస్తున్నారు.

## దివ్యఖురాన్ దహనాన్ని ఖండించిన ఐక్యరాజ్యసమితి- ఓటింగులో అసలు రంగు చూపించిన యూరపు దేశాలు

స్వీడనులో దివ్యఖుర్ఆన్ దహనానికి సంబంధించిన సంఘటనల తర్వాత ఐక్యరాజ్యసమితిలో ఈ సంఘటనను ఖండిస్తూ తీర్మానం ప్రవేశపెట్టడం జరిగింది. ముస్లిం దేశాలు ఈ తీర్మానానికి పూర్తి మద్దతు పలికాయి. ఐక్యరాజ్యసమితి మానవహక్కుల మండలి ఈ సంఘటనను ఖండిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఇది మతతత్వ విద్వేష చర్యగా గుర్తించింది. ఈ తీర్మానాన్ని మండలిలోని 47 దేశాల్లో 28 దేశాలు సమర్థించాయి. చైనా, ఉక్రెయిన్, ఆఫ్రికాదేశాలు భారతదేశం సమర్థించాయి. ఏడు దేశాలు ఓటింగులో పాల్గొనలేదు. పన్నెండు దేశాలు వ్యతిరేకంగా ఓటు చేశాయి. ఇందులో ఫ్రాన్సు, జర్మనీ, బ్రిటన్, అమెరికా దేశాలున్నాయి. ఇలాంటి విద్వేష చర్యలకు పాల్పడిన వారిని శిక్షించే చట్టాలు చేయాలని వివిధ దేశాలను ఈ తీర్మానం కోరింది. ఇలాంటి చట్టాలు లేని దేశాలను గుర్తించి నిపుణుల రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఈ విషయమై నిర్వహించాలని కూడా ఈ తీర్మానం కోరింది. అయితే ఇలాంటి ధర్మదూషణ చట్టాలను పాశ్చాత్య దేశాలు వ్యతిరేకించాయి. అయితే స్వీడనులో జరిగిన సంఘటన లను ఖండిస్తున్నట్లు ఈ దేశాలు తెలిపాయి. అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్ దేశాలు ఈ తీర్మానాన్ని వ్యతిరేకించా లని వివిధ దేశాలకు పిలుపునిచ్చాయి. భావప్రకటనా స్వేచ్ఛకు ఇలాంటి చట్టాలు వ్యతిరేకమైనవని ఈ దేశాలు చెప్పాయి. ఏది ఏమైనా ఈ దేశాలు బైబిలు విషయంలోను, క్రయిస్తవ ధర్మం విషయంలోను ఇదే భావప్రకటనాస్వేచ్ఛను ఒప్పుకోవన్నది ఇప్పటికి చాలా సార్లు రుజువయ్యింది.

## ఇస్లామోఫోబియాపై ఉద్యమించిన కెనడా నగరం టోరంటో

కెనడాలో ఇస్లామోఫోబియా నానాటికి పెరుగుతోంది. ఇస్లామో ఫోబియాపై పోరాడ్డానికి కెనడా నగరం టోరొంటో ఒక ఉద్యమమే ప్రారంభమైంది. టోరంటో అందరిదీ పేరుతో ఈ ఉద్యమం ముస్లిం విద్వేష, పక్షపాతాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యానికి ప్రయత్నిస్తోంది. వివక్ష, జాతితత్వాలను వ్యతిరేకించే సమాజం కోసం ఈ సంవత్సరం టోరొంటో ఫర్ ఆల్ ఉద్యమం నడుపుతు న్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ప్రతి సంవత్సరం టోరంటో ఫర్ ఆల్ ఉద్యమం నిర్వహిస్తారు. వివిధ విషయాలను ప్రధానాం శాలుగా తీసుకుని ఇప్పటి వరకు ఈ ఉద్యమాలు నిర్వహించారు. ఈసారి ఇస్లామోఫోబియాపై దృష్టిపెట్టారు. ఈ ఉద్యమం సందర్భంగా ప్రజలకు ఇస్లాం గురించి తెలుసుకునే వనరులు అందజేయడం, వెబ్ సైటు లింకులు అందజేయడం, ఇస్లాం గురించి ఫాక్ట్ షీట్లు, పుస్తకాలు పంచడం జరుగుతుంది. ఇస్లామో ఫోబియాపై పోరాడుతున్న వారికి సహకారం అందించడం జరుగు తుంది. అలాగే ముస్లిం సంస్థలతో కలిసి పని చేయాలనుకునే వారికి అవకాశాలు కల్పించడం జరుగుతుంది. 2016లో కెనడా పెద్ద సంఖ్యలో సిరియా శరణార్థులకు అనుమతి ఇచ్చినప్పుడు కూడా ఇస్లామోఫోబియాకు వ్యతిరేకంగా చైతన్యోద్యమం నడపడం జరిగింది. ఆ తర్వాతి నుంచి కెనడాలో ఇస్లామో ఫోబియా విస్తరించడం ప్రారంభమైంది. ముఖ్యంగా ముస్లిం సాంప్రదాయిక దుస్తులు ధరిస్తున్నవారిపై, బురఖా ధరించిన మహిళలపై దాడులు పెరిగాయి.

## స్వీడను భాషలో లక్ష దివ్యఖుర్ఆన్ అనువాదాలు ప్రచురిస్తున్న కువైట్



స్వీడనులో బక్రీద్ పండుగ రోజున ఒక మస్జిదు ముందు ఒక దుండగుడు దివ్య ఖుర్ఆన్‌ను దహనం చేసిన సంఘటన తర్వాత తీవ్ర నిరసనలు పెల్లుబికిన విషయం తెలిసిందే. స్వీడను ప్రజలకు దివ్యఖుర్ఆన్ సందేశాన్ని తెలుసు కునే అవకాశం కల్పించడానికి కువైట్ నిర్ణయించింది. స్వీడను భాష స్వీడిస్‌లో లక్ష దివ్య ఖుర్ఆన ప్రతులను ముద్రించాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి షేక అహ్మద్ నవాఫ్ అల్ అహ్మద్ అల్ సబా ఈ ప్రతిపాదన చేశారు. మంత్రివర్గ సమావేశం ఈ ప్రతిపాదనను ఆమోదించింది. ఇస్లాంలో శాంతి సహన భావాలను, ఇస్లామీయ విలువలను, శాంతియుత సహజీవన భావాలను ప్రచారం చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రివర్గ సమావేశం తెలియజేసింది. త్వరలోనే స్వీడిష్ భాషలో దివ్య ఖుర్ఆన్ ప్రచురణ పూర్తికావస్తోంది. స్వీడనులోని మస్జిదులు, లైబ్రరీలు, స్కూళ్ళు, ఇతర సంస్థల్లో ఈ దివ్యఖుర్ఆన్ ప్రతులను పంపిణీ చేస్తారు. స్వీడనులో దివ్యఖుర్ఆన్ దహనం సంఘటనను కువైట్ తీవ్రంగా ఖండించింది. మతతత్వ విద్వేష చర్యలను వివిధ ప్రభుత్వాలు అడ్డుకోవాలని కువైట్ కోరింది.

## హిందూ జంటకు పెళ్ళి చేసిన ముస్లిం యూత్ లీగ్ : కేరళలో మతసామరస్యం

కేరళలో మత సామరస్యానికి సంబంధించిన మరో వార్త ఇటీవల ముందుకు వచ్చింది. కేరళలోని మలాప్పురం జిల్లాలో ముస్లిం జనాభా ఎక్కువ. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ యువ విభాగం ముస్లిం యూత్ లీగ్ ఇక్కడ బలంగా ఉంది. ఇక్కడి వెంగరలో ఉన్న అమ్మంచిరి భగవతి గుడిలో ఒక హిందూ జంట పెళ్ళి ముస్లిం యూత్ లీగ్ జరిపించింది. పలక్కడ్ కు చెందిన గీతు మలపురం జిల్లాలోని వెంగర మహిళల హాస్టలులో ఉంటోంది. ఈ హాస్టలును ముజాహిద్ ఎడ్యుకేషన్ ట్రస్టు నడుపుతోంది. దౌర్జన్యాలకు గురైన మహిళలు, ట్రాఫికింగ్ బాధితులు ఇతర బాధిత మహిళల కోసం ఈ హాస్టలును నడుపుతున్నారు. అయితే ఈ హాస్టలుకు గత సంవత్సరం నుంచి గ్రాంటులు రావడం లేదని వెంగర పంచాయతి ప్రెసిడెంట్ హసీనా ఫజల్ చెప్పారు. గీతు, ఆమె సోదరి గిరిజ, వారి తల్లి ఈ హాస్టలులో మిగిలిన చివరి వాళ్ళు. గత సంవత్సరం యూత్ లీగ్ చొరవతో గిరిజ పెళ్ళి జరిపించడం జరిగింది. అవసరమైన ఆర్థిక సహాయం ముస్లిం యూత్ లీగ్ చేసిందని పంచాయతి ప్రెసిడెంట్ చెప్పారు. గీతు సోదరి గిరిజకు రాకేష్ అనే అబ్బాయికి ఇచ్చి పెళ్ళి జరిపించారు. ఇప్పుడు గీతు పెళ్ళి కోజికోడ్ కు చెందిన విష్ణుతో జరిపించారు. అవసరమైన ఆర్థిక సహాయం ముస్లిం యూత్ లీగ్ అందించింది. ఈ పెళ్ళికి వివిధ పార్టీల నేతలు, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేతలు హాజరయ్యారు. బగవతీ మందిరంలో ఈ పెళ్ళి జరిగింది. గుడి కమిటీ కూడా సహాయ సహకారాలు అందించింది. అద్భుతమైన మతసామరస్యానికి వెంగర గ్రామం ఒక ఉదాహరణగా నిలిచింది.

## అంతర్జాతీయ వేదికలపై మణిపూర్ హింసాకాండ ప్రతిధ్వనులు

భారత ప్రధాని నరేంద్రమోడీ ఫ్రాన్సు పర్యటనకు పారిస్ చేరుకున్న వెంటనే జరిగిన ఈ పరిణామం భారత ప్రతిష్ఠకు ఒక మాయని మచ్చగానే భావించాలి. మోడీ ఫ్రాన్సు నగరం పారిస్ చేరుకున్న తర్వాత, మరో ఫ్రాన్సు నగరం స్ట్రాస్బో లో యూరోపియన్ పార్లమెంటు సమావేశం జరిగింది. భారతదేశంలోని మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాకాండ పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. మణిపూర్ హింసాకాండను తక్షణం భారత ప్రభుత్వం నిరోధించాలని, మైనారిటీల హక్కులను కాపాడాలని తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సమస్యపై చర్చ తర్వాత తీర్మానానికి అనుకూలంగా వచ్చిన ఓట్లతో తీర్మానం ఆమోదం పొందింది. భారత ప్రభుత్వం ఈ పరిణామం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. యూరోపియన్ యూనియన్ పార్లమెంటు తీర్మానం తమకు స్వీకారయోగ్యం కానేకాదని ఖండించింది. యూరోపియన్ యూనియన్ పార్లమెంటు భారత ప్రభుత్వాన్ని మైనారిటీల హక్కులు కాపాడాలని చెప్పింది. అంటే మణిపూర్‌లోని క్రయిస్తవ మైనారిటీల హక్కుల గురించి మాట్లాడింది. అలాగే అల్లర్లు జరుగుతున్న ప్రాంతంలో జర్నలిస్టులు, అంతర్జాతీయ ప్రతినిధులకు వెళ్ళే అవకాశాలు కల్పించాలని, ఇంటర్నెట్ షట్ డౌన్ వెంటనే తొలగించాలని కోరింది. అలాగే సాయుధ దళాల ప్రత్యేకాధికారాల చట్టాన్ని తొలగించాలని కూడా కోరింది. భారతదేశంతో చర్చల్లో మానవ హక్కుల ప్రస్తావన ప్రముఖంగా ఉండాలని కూడా ఈ తీర్మానంలో ఉంది. వెనిజులా, కిర్గిస్తాన్‌లపై కూడా తీర్మానాలు ఆమోదించడం జరిగింది. ఈ తీర్మానం వలసవాద భావజాలంతో కూడుకున్నదని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి అరిందం బాగ్చీ అన్నారు. మణిపూర్ లో పరిస్తితిని భారత అధికారులు అదుపు చేస్తున్నారని, శాంతిభద్రతలు పునరుద్ధరించడం జరుగుతోందని చెప్పారు. యూరోపియన్ యూనియన్ తమ స్వంత వ్యవహారాలపై దృష్టిపెట్టడం మంచిదని సలహా ఇచ్చారు. ❖

తుదిగీటు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**